Bhavani Publication Trust
https://prajatheerpudaily.com

# ప్రజాతీర్పు


The people's Verdict

తెలుగు జాతీయ దినపత్రిక

రిపోర్టర్లు కావలెను
అధునాతన సాంకేతికతతో..
ఎప్పటి వార్తలు అప్పుడు అందించేందేందుకు
మీ ముందుకు వచ్చిన
ప్రజా టెలివిజన్
యూట్యూబ్ చానల్‌లో పని చేయుటకు
రిపోర్టర్లు కావలెను. ఎలాంటి టార్గెట్లు ఉండవు.
నిత్యనూతనంగా వార్తలు, లైవ్‌లు అందించడమే మీ పని..
సంప్రదించండి: 8309979541, 9494659622
PRAJA TELEVISION
The People's Favour
మా యూట్యూబ్ చానల్‌ను
సపోర్ట్ చేయండి
8309979541
ప్రజా టెలివిజన్
తాజా వార్తలు, అప్‌డేట్,
లైవ్ ప్రోగ్రామ్‌ల కోసం లైక్, షేర్, సబ్‌స్క్రైబ్

సంపుటి : 26 | సంచిక : 209 | హైదరాబాద్ | సోమవారం 22 జూన్ 2026 | పేజీలు : 8 | వెల : రూ. 1/-

Cerculated From : KARIMNGAR, HYDERABAD, WARAGAL, RANGAREDDY, MAHABOOBNAGAR, THIRUPATI, GUNTUR, KURNOOL, ANATAPUR, VISAKAPATNAM, CHENNAI, BANGALOOOR



## ప్రపంచ ఉద్యమంగా యోగా

### వ్యక్తిగత ఆరోగ్యానికే కాకుండా శాంతికి మంత్రం.. అభ్యాసం ఒక రోజుకు పరిమితం కాకూడదు

### అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ప్రధాని ఉద్ఘాటన.. కోల్‌కతాలో ఆసనాలు వేసిన మోదీ

కోల్‌కతా: యోగా అనేది ప్రపంచ ఉద్యమమని, అది దేశాల.. సాంస్కృతిక సరిహద్దులను అధిగమిస్తుందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. కేవలం ఒక్క రోజుకో, ఒక్క కార్యక్రమానికో పరిమితం చేయకుండా యోగాభ్యాసాన్ని దైనందిన జీవనంలో భాగంగా మార్చుకోవాలని పిలుపునిచ్చారు. జూన్ 21 అంటే సుదీర్ఘ పగలు ఉండే రోజుగానే కాకుండా అతి పెద్ద సామాజిక వేడుక దినంగా మారిందని, దానికి యోగా కారణమని పేర్కొన్నారు. 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం కోల్‌కతాలోని రెడ్‌రోడ్‌లో జరిగిన వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కోల్‌కతాతోపాటు దేశంలోని అనేక ప్రాంతాల్లో, విదేశాల్లోని భారత రాయబార కార్యాలయాల ఆధ్వర్యంలో భారీగా వేడుకలు నిర్వహించారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, కేంద్ర మంత్రులు, ఆయా రాష్ట్రాల గవర్నర్లు, ముఖ్యమంత్రులు, వివిధ వర్గాలవారు, దౌత్యవేత్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు. కోల్‌కతా కార్యక్రమంలో మోదీ మాట్లాడుతూ– వ్యక్తిగత ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవడానికే కాకుండా ప్రపంచ శాంతికి ఉత్ప్రేరకంగా యోగా నిలుస్తుందని చెప్పారు. 'ప్రాచీన భారతీయ అభ్యాసమైన యోగావల్ల శారీరక ఆరోగ్యానికి మించిన ప్రయోజనాలు అనేకం ఉన్నాయి. పనిని, పోషకాహారాన్ని, నిద్రను మనం సమతుల్యం చేసుకోవాలి. ఆధునిక జీవనశైలిలో దీనికి కొంత అవాంతరం వాటిల్లుతుంటుంది. ఏం చేయాలి.. ఏం చేయకూడదు.. జీవితాన్ని ఎలా సంతులనం చేసుకోవాలనేది యోగా మనకు చెబుతుంది. మన శరీరాన్ని ఎలా మలచుకోవాలో తెలిస్తే ఆరోగ్యం ఒక అలవాటుగా మారిపోతుంది. శారీరక ఆరోగ్యం, మానసిక

- మిగతా 2వ పేజీలో



## నాపై కుట్ర చేయాల్సిన అవసరం పార్టీలో ఎవరికీ లేదు

### వంచనలో భాగంగానే భాజపా మూడో అభ్యర్థి: మీనాక్షి

హైదరాబాద్: రాజ్యసభ ఎన్నికల్లో తన నామినేషన్ తిరస్కరణకు గురయ్యేలా కాంగ్రెస్‌లో ఎలాంటి కుట్రా జరగలేదని ఏఐసీసీ రాష్ట్ర ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్ స్పష్టంచేశారు. పార్టీలో తనపై కుట్ర చేయాల్సిన అవసరం ఎవరికీ లేదన్నారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, ఏఐసీసీ రాష్ట్ర కార్యదర్శి సచిన్ సావంత్‌లతో కలిసి ఆదివారం ఆమె గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడారు. "మధ్యప్రదేశ్‌లో 3 రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు జరిగాయి. మెజార్టీ లేకపోయినా ఫౌల్ గేమ్ ప్లాన్‌తోనే భాజపా మూడో అభ్యర్థిని

- మిగతా 2వ పేజీలో



## అజేయంగా మన సముద్ర శక్తి

### ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్య

### దుణగిరి, సంశోధక్, అగ్రయ్ నౌకలను జాతికి అంకితమిచ్చిన మోదీ

కోల్‌కతా: ఒక దేశం ఆర్థిక, వ్యూహాత్మక ప్రభావానికి బలమైన నౌకాదళ సామర్థ్యమే నిర్ణయాత్మక అంశమని ప్రధాని మోదీ చెప్పారు. అందుకు అనుగుణంగానే భారత్ సన్నద్ధమవుతోందని వివరించారు. దేశీయ పరిజ్ఞానంతో నిర్మించిన మూడు కీలక యుద్ధనౌకలు ఐఎన్ఎస్ దుణగిరి, ఐఎన్ఎస్ సంశోధక్, ఐఎన్ఎస్ అగ్రయ్‌ని మోదీ ఆదివారం జాతికి అంకితం చేశారు. పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలోని శ్యామప్రసాద్ ముఖర్జీ పోర్టులో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. సముద్రయాన సామర్థ్యాలు కలిగిన దేశం శక్తివంతమైనదిగా, అధిక ఆర్థిక, వ్యూహాత్మక ప్రభావాన్ని కలిగి ఉంటుందని గుర్తుచేశారు. అజేయమైన సముద్ర శక్తిగా

- మిగతా 2వ పేజీలో



# విత్ డ్రాలకు వేళాయె!

### ఎస్‌బీఐలో లావాదేవీల నిలిపివేత దిశగా సర్కారు అడుగులు

- కేంద్రం నుంచి వచ్చిన నిధులు కూడా విత్‌డ్రా.. ప్రస్తుతం రూ.5–6వేల కోట్లు ఉన్నట్లు అంచనా
- కార్పొరేషన్ల ఫిక్స్‌డ్ డిపాజిట్లు సైతం వెనక్కి.. 'లీడ్ బ్యాంకు' హోదా కూడా తొలగింపు?
- నేడు ప్రభుత్వం నిర్ణయం తీసుకునే అవకాశం.. ఢిల్లీ పర్యటనకు వెళ్లిన సీఎం రేవంత్‌రెడ్డి
- ఎస్‌బీఐ తీరును ప్రధానికి, ఆర్థిక మంత్రికి,ఆర్‌బీఐ గవర్నర్‌కు వివరించనున్న సీఎం

హైదరాబాద్, జూన్ 21 : స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) నుంచి ప్రభుత్వానికి సంబంధించిన అన్ని లావాదేవీలనూ ఉపసంహరించుకునే యోచనలో ఉన్న సర్కారు.. ఈ దిశగా కసరత్తు ముమ్మరం చేసినట్లు తెలుస్తోంది. రాయదుర్గంలోని సర్వే నంబరు 83/1లోని 5 ఎకరాల భూముల వేలం విషయంలో ఎస్‌బీఐ వ్యవహరించిన తీరు పట్ల ఆగ్రహంతోనే ప్రభుత్వం ఈ నిర్ణయం దిశగా అడుగులు వేస్తోంది. అంతేకాకుండా.. పలు పథకాలు, ఇతరత్రా మ్యాచింగ్ గ్రాంట్ల కోసం కేంద్రం నుంచి వచ్చిన నిధులను కూడా ఎక్కువగా ఎస్‌బీఐలోనే పెడుతుండగా.. వాటిని కూడా వెంటనే విత్‌డ్రా చేసుకోవాలనే ఉద్దేశంతో ఉన్నట్టు తెలిసింది. మరోవైపు ప్రభుత్వ పరిధిలోని పలు కార్పొరేషన్‌లు, ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలకు సంబంధించి వందల కోట్ల రూపాయల ఫిక్స్‌డ్ డిపాజిట్లు ఎస్‌బీఐలో ఉన్నట్లు సర్కారు సేకరించిన ప్రాథమిక వివరాల్లో తేలిందని, వాటిని కూడా వడ్డీతో సహా బ్యాంకు నుంచి విత్‌డ్రా చేసుకోవాలని భావిస్తున్నట్లు సమాచారం. దీంతోపాటు ప్రభుత్వంలో ఎస్‌బీఐకి ఉన్న 'లీడ్ బ్యాంకు' హోదానూ పక్కనపెట్టే అంశంపై సమాలోచనలు చేస్తున్నట్లు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ అంశాలన్నింటిపై సోమ, మంగళవారాల్లో తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని చెబుతున్నారు. ఆదివారం ఢిల్లీ పర్యటనకు వెళ్లిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. రాయదుర్గంలోని ఐదెకరాల భూముల విషయంలో ఎస్‌బీఐ వ్యవహరించిన తీరును సోమ, మంగళవారాల్లో ప్రధాని మోదీకి, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు, ఆర్‌బీఐ గవర్నర్ మల్హోత్రాకు వివరించే అవకాశం ఉందని తెలిసింది.



## రాహుల్ అపాయింట్‌మెంట్ ఇప్పిస్తే గ్యారంటీలపై వినతులిస్తాం

### సీఎం రేవంత్‌కి భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు లేఖ

హైదరాబాద్: రాష్ట్రంలో నెరవేరని కాంగ్రెస్ గ్యారంటీలు, హామీలపై వినతిపత్రం సమర్పించేందుకు లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీతో అపాయింట్‌మెంట్ ఇప్పించాలని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు

- మిగతా 2వ పేజీలో



## లెబనాన్‌పై దాడులు ఆపాల్సిందే!

### ఇజ్రాయెల్ వైఖరిపై ఇరాన్ అభ్యంతరాలు

### అమెరికా చొరవ తీసుకుని దాడులు ఆపాలని డిమాండ్

### స్విట్జర్‌ల్యాండ్ వేదికగా శాంతిచర్చలు

### పాక్ ప్రధాని షరీఫ్, ఖతార్ ప్రధాని అబ్దుల్ రెహమాన్ మధ్యవర్తిత్వం

బెర్న్, జూన్ 21: లెబనాన్ నుంచి ఇజ్రాయెల్ సైనిక దళాలను ఉప సంహరించుకోవాల్సిందేనని, ఎట్టిపరిస్థితుల్లోనూ దాడులు ఆపాల్సిందేనని ఇరాన్ బృందం తేల్చిచెప్పింది. అమెరికా చొరవ తీసుకుని లెబనాన్‌పై దాడులు నిలిచిపోయేలా చూడాలని డిమాండ్ చేసింది. శాంతిచర్చలు

- మిగతా 2వ పేజీలో



## ఇతర రాష్ట్రాలతో కలిసి జీరాంజీపై పోరాడతాం

### అవసరమైతే సుప్రీంకోర్టుకెళ్తాం: మంత్రివర్గ ఉపసంఘం

హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం జులై 1 నుంచి అమలు చేయనున్న జీరాంజీకి వ్యతిరేకంగా భాజపాయేతర పార్టీలు పాలించే రాష్ట్రాలతో కలిసి ఉమ్మడిగా పోరాడాలని రాష్ట్ర మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయించింది. అవసరమైతే అన్ని రాష్ట్రాలు కలిసి సుప్రీంకోర్టును ఆశ్రయించే అంశాన్ని కూడా పరిశీలించాలని అభిప్రాయపడింది. పథకంపై ప్రభుత్వానికి సమగ్ర సిఫార్సులు అందించేందుకు అంశాలవారీగా అధ్యయనం కొనసాగించాలని గ్రామీణ సంక్షేమం, ఉపాధి భద్రత, రాష్ట్రాల హక్కుల పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని తుది నివేదిక

- మిగతా 2వ పేజీలో




## గాంధీ పేరిట విధ్వంసం

### సీఎం రేవంత్‌రెడ్డి నమ్మేది గాడ్సేను.. గాంధీ విగ్రహం పెడతానని దొంగ మాటలు

### గాంధీపై ప్రేమ ఉంటే పేదల ఇండ్లు కూల్చొద్దు.. మహాత్ముడి ఆత్మ కూడా ఘోషిస్తుంది

### కాంగ్రెస్ నీచ రాజకీయాలకు బీజేపీ కూడా మద్దతు

### 'చోటే భాయ్.. బడే భాయ్' ఇద్దరూ కలిసి మూసీ భూములు లూటీ

### రాజేంద్రనగర్ కార్యకర్తల సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

## నాపై కుట్ర చేయాల్సిన అవసరం పార్టీలో
# ఎవరికీ లేదు

(మొదటి పేజీ తరువాయి)

బరిలో దింపింది. డబ్బులు, బెదిరింపులతో మూడో స్థానం గెలవలేమని భాజపా చివర్లో గ్రహించింది. నా నామినేషన్ ఆమోదం విషయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఎలక్షన్ కమిషన్ భాజపాతో రాజీపడ్డాయి. ఆ కేసులో నాకు నోటీసిచ్చిన సమాచారం తెలంగాణలో ఎవరైనా ఎందుకు లీక్ చేస్తారు?. ఆర్ఓ భాజపాతో రాజీపడి నా నామినేషన్‌ను తిరస్కరించారు. నాపై కుట్ర చేశారనే వదంతులు నామినేషన్ తిరస్కరణకు ఒకరోజు ముందు నుంచే భాజపా ప్రచారం చేసింది.తెలంగాణలో ఎవరూ నా కోసం రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేయడం లేదు. ఎవరో నా కోసం రాజీనామా చేస్తున్నారని జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదు. నా రాజకీయం మధ్యప్రదేశ్‌లో ఉంటుంది. ప్రస్తుతం పదవిలో ఉన్న రాజ్యసభ సభ్యుడిని రాజీనామా చేయించి ఆ స్థానం తీసుకునే అవసరం నాకు లేదు. నాపై క్రిమినల్ కేసులు లేవు. కేవలం నోటీసు ఇచ్చారు. నామినేషన్‌లో ఇలాంటి కేసుల వివరాలు తెలపాల్సిన అవసరం లేదు. ఆ కేసు నేను తెలంగాణ రాష్ట్రానికి ఏఐసీసీ ఇన్‌ఛార్జిగా వెళ్లకముందుదని ఆర్‌ఓకు చెప్పాను. కుంభం శివకుమార్‌పై వచ్చిన ఫిర్యాదు అంశం సీరియస్ అని గ్రహించే ఆయనకు ఎన్నికల్లో నారాయణపేట టికెట్ ఇవ్వలేదు. అయినా ఇప్పటివరకూ ఆ కేసులో ఏమీ రుజువుకాలేదు. ఒక వ్యక్తిపై అభియోగాలుంటే కుటుంబంలోని వారికి టికెట్ ఇవ్వకూడదని ఎక్కడా లేదు. నా నామినేషన్ తిరస్కరణ విషయంలో మేం ఒక్క నిమిషం కూడా నిరాశ చెందలేదు. భాజపా ఎలాంటి రాజకీయం చేసిందో దేశానికి చూపించాం. ఓటు చోరీ, సీటు చోరీ జరుగుతోందని రెండేళ్ల నుంచి రాహుల్ గాంధీ చెబుతున్నారు" అని మీనాక్షి నటరాజన్ పేర్కొన్నారు.

## రాహుల్ అపాయింట్‌మెంట్ ఇప్పిస్తే
# గ్యారంటీలపై వినతులిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

రామచందర్ రావు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు సీఎంకు ఆయన ఆదివారం బహిరంగ లేఖ రాశారు. "2023 శాసనసభ ఎన్నికల్లో రాహుల్‌గాంధీ, సోనియాగాంధీ, ప్రియాంకాగాంధీ ఇచ్చిన హామీలు, గ్యారంటీలు నమ్మి.. రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్‌కు ఓటు వేశారు. కానీ మీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా.. మహిళలు, రైతులు, విద్యార్థులు, యువత, వృద్ధులు, వ్యవసాయ కార్మికులు, పేద కుటుంబాలకు ఇచ్చిన హామీలు ఇంకా నెరవేరలేదు. మహిళలకు రూ.2,500 అందడంలేదు. రైతు భరోసా కింద రూ.15 వేలు రావడం లేదు. ఇందిరమ్మ ఇళ్ల కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారు. విద్యా భరోసా కింద ఇస్తామన్న రూ.5 లక్షల సహాయం ఇంకా కార్యరూపం దాల్చలేదు. రాహుల్‌గాంధీ పదేపదే నిరుద్యోగులకు ఇచ్చిన హామీ.. నెలకు రూ.4 వేల నిరుద్యోగ భృతి అమలు కావడం లేదు. వృద్ధులు రూ.4 వేల పెన్షన్ కోసం ఎదురు చూస్తున్నారు. వీటన్నిటినీ నేరుగా రాహుల్‌గాంధీ దృష్టికి తీసుకెళ్లేందుకు త్వరగా అపాయింట్‌మెంట్ ఖరారు చేయాలి" అని రామచందర్‌రావు ఆ లేఖలో పేర్కొన్నారు.

### కిషన్‌రెడ్డిని సీఎం ఎందుకు కలవరు?

ఇప్పటి వరకు ఎన్నోసార్లు దిల్లీ వెళ్లి కేంద్ర మంత్రులను కలిసిన సీఎం.. కిషన్‌రెడ్డిని కలిసేందుకు ఎందుకు ప్రయత్నించలేదని రామచందర్‌రావు ప్రశ్నించారు. ఆదివారం నారాయణపేట జిల్లా కేంద్రంలో జరిగిన పార్టీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ అపాయింట్‌మెంట్ తీసుకోవాలని కోరుతూ కిషన్‌రెడ్డికి సీఎం రేవంత్‌రెడ్డి లేఖ రాయడాన్ని ప్రస్తావిస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలు, అబద్ధపు హామీలపై ముఖ్యమంత్రి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

## ఇతర రాష్ట్రాలతో కలిసి
# జీరాంజీపై పోరాడతాం

(మొదటి పేజీ తరువాయి)

రూపొందించాలని తీర్మానించింది. ఆదివారం పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో మంత్రివర్గ ఉపసంఘ సమావేశం జరిగింది. పంచాయతీరాజ్, వ్యవసాయ, కార్మికశాఖల మంత్రులు సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు, వివేక్‌లు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. పంచాయతీరాజ్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దానకిశోర్, కమిషనర్ దివ్యా దేవరాజన్, ప్రత్యేక కమిషనర్ లక్ష్మి, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొత్త చట్టం వల్ల గ్రామీణుల ఉపాధి, స్థానిక సంస్థలు, వ్యవసాయ రంగంపై కలిగే ప్రభావాలపై చర్చించారు. క్షేత్రస్థాయి పరిస్థితులు, గ్రామీణ ప్రాంత ప్రజల అవసరాలు, కూలీల జీవనోపాధిపై చట్టం ప్రభావం వంటి అంశాల గురించి అధికారులు వివరించారు. కొత్త చట్టంలో ప్రతిపాదించిన 60 రోజుల ఉపాధి విరామం అమలు సాధ్యం కాదని మంత్రులు అన్నారు. దీనివల్ల కూలీలకు ఉపాధి అవకాశాలు తగ్గిపోవడంతో పాటు కూలి రేట్లపై ప్రతికూల ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా రాష్ట్రాలను సంప్రదించకుండా కేంద్ర ప్రభుత్వం 40% నిధుల భారాన్ని మోపడం అప్రజాస్వామికమని పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలతో పాటు భాజపాయేతర పార్టీల పాలనలో ఉన్న రాష్ట్రాలతోనూ సంప్రదింపులు జరపాలని సమావేశం నిర్ణయించింది. మరో రెండు మూడు రోజుల్లో సబ్ కమిటీ మరోసారి సమావేశమై తదుపరి కార్యాచరణపై చర్చించాలని నిర్ణయం తీసుకుంది.

### కేంద్రం కుట్రలను అడ్డుకుంటాం

సమావేశం అనంతరం ఉత్తమ్ మాట్లాడుతూ "ఉపాధి హామీ చట్టం ద్వారా గ్రామీణ పేదలకు కల్పించిన హక్కులను క్రమంగా నిర్వీర్యం చేసి, రాష్ట్రాల అధికారాలను హరించేందుకు కేంద్రం కుట్రపూరితంగా ఈ కొత్త చట్టాన్ని తీసుకొస్తోంది. దీనిని అడ్డుకుంటాం. ఉపాధి హామీ పథకానికి మహాత్మా గాంధీ పేరు తొలగించడం దేశ చరిత్రను అవమానించడమే. రాంజీ చట్టాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలి" అని ఆయన డిమాండ్ చేశారు.

# అజేయంగా మన సముద్ర శక్తి

(మొదటి పేజీ తరువాయి)

భారత్ వేగంగా ఎదుగుతోందని తెలిపారు. ఐఎన్ఎస్ దుణగిరి, ఐఎన్ఎస్ అగ్రయ్, ఐఎన్ఎస్ సంశోధక్ నౌకలు సముద్ర పోరాటం, హైడ్రోగ్రాఫిక్ సర్వేయింగ్, జలాంతర్గామి వ్యతిరేక యుద్ధంలో కీలక పాత్ర పోషిస్తాయని ప్రధాని మోదీ తెలిపారు. 2022లో 'ఐఎన్ఎస్ విక్రాంత్'విమాన వాహక నౌకను ప్రారంభించడం ద్వారా భారత్ తన సముద్ర సామర్థ్యాలను ప్రపంచానికి చాటిచెప్పిందని అన్నారు. కొత్త నౌకలను మనదేశంలోనే డిజైన్ చేసి, నిర్మించామని, దేశ ప్రతిభకు నిదర్శనంగా నిలుస్తున్నాయని హర్షం వ్యక్తంచేశారు.

### ఉపాధి ఇంజిన్‌గా 'మారిటైమ్'

లక్షలాది ఉద్యోగాలను సృష్టించే సామర్థ్యం మారిటైమ్ రంగానికి ఉందని, 'అభివృద్ధి చెందిన భారత్'కు ఇది ఉపాధి ఇంజిన్‌గా పనిచేస్తుందని పేర్కొన్నారు. ఆధునిక నౌక నిర్మాణానికి వేల టన్నుల ఉక్కు, ఎలక్ట్రానిక్స్, యంత్ర పరికరాలు, విడిభాగాలు అవసరమవుతాయని, వీటి తయారీకి అనేక కంపెనీలు పనిచేస్తున్నాయని, తద్వారా వేలాది మంది యువతకు ఉపాధి లభిస్తోందని ప్రధానమంత్రి తెలియజేశారు. కొత్త నౌకల విశేషాలు.. ఐఎన్ఎస్ దుణగిరి: ఇది అత్యాధునిక స్టెల్త్ యుద్ధ నౌక. బ్రహ్మోస్ క్షిపణులు, మధ్యశ్రేణి గగనతల క్షిపణి వ్యవస్థ, ఆయుధాలు, సెన్సర్లు ఇందులో అమర్చారు. దీని పొడవు 149 మీటర్లు. 2022 జూలై 15న జలప్రవేశం చేసింది. ఐఎన్ఎస్ సంశోధక్: ఇది భారీ సర్వే నౌక. భారత తీర ప్రాంతాలు, లోతైన సముద్ర జలాల్లో హైడ్రోగ్రాఫిక్ సర్వేలు నిర్వహించడానికి ఈ నౌక సాయపడుతుంది. రక్షణ, పౌర అవసరాల కోసం సముద్ర గర్భ డేటాను సేకరించడానికి ఇది తోడ్పడుతుంది. దీని పొడవు 110 మీటర్లు. 2023 జూన్ 13వ తేదీన తొలిసారిగా జలప్రవేశం చేసింది.







# ప్రపంచ ఉద్యమంగా యోగా

(మొదటి పేజీ తరువాయి)

ప్రశాంతత, ఆత్మ చైతన్యాలకు యోగా ఉపయోగపడుతుంది. ఏం చేయకూడదనే చైతన్యం మనలో వచ్చినప్పుడు ప్రపంచ శాంతికీ అది దారులు తెరుస్తుంది. అందుకే మన జీవన విధానానికే కాకుండా ప్రపంచ భవితవ్యం మెరుగయ్యేందుకూ ఇది అవసరం. అందుకే జీవితకాలమంతా దీనిని మనం, మన కుటుంబాలు, భవిష్యతరాలు అభ్యసించాలి. ప్రజల్ని దగ్గర చేయడానికి యోగా దారి చూపిస్తుంది. శారీరకంగానే కాకుండా అన్నివిధాలా, అన్ని వయసుల వారికీ ఇది ప్రయోజనం కలిగిస్తుంది. మానవాళి ఐక్యతను ప్రోది చేస్తుంది' అని ప్రధాని చెప్పారు. తెల్లని దుస్తుల్లో కార్యక్రమానికి హాజరైన మోదీ.. వేలమంది ప్రజలతో కలిసి యోగాసనాలు వేశారు. 40 నిమిషాలపాటు కొనసాగిన కార్యక్రమంలో ఆయన ప్రజల మధ్యకు వెళ్లి వారు యోగాభ్యాసం చేస్తున్న తీరును స్వయంగా గమనించారు. కొందరు సరైన భంగిమలో ఆసనాలు చేసేలా ఆయన సహకారం అందించారు.

### తాజ్‌మహల్ నుంచి బీదర్ కోట వరకూ..

యోగా దినోత్సవం సందర్భంగా ప్రపంచ ప్రఖ్యాత తాజ్‌మహల్ నుంచి బీదర్ కోట వరకూ దేశంలోని అనేక ప్రాంతాల్లో కార్యక్రమాలు నిర్వహించారు. 'భారత పురావస్తు సర్వేక్షణ సంస్థ' (ఏఎస్ఐ) అధీనంలో ఉన్న అనేక ప్రాంతాలు వీటికి వేదికలయ్యాయి. 'వయసుతోపాటు ఆరోగ్యానికి యోగా' అనే ఇతివృత్తంతో ఈసారి కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యప్రదేశ్‌లోని జబల్పూర్‌లో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, లద్దాఖ్‌లో ఉపరాష్ట్రపతి సి.పి.రాధాకృష్ణన్, షిల్లాంగ్‌లో రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ఆసనాలు వేశారు. సుప్రీం కోర్టు ప్రాంగణంలో భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ యోగాసనాలు వేశారు. దృష్టి కేంద్రీకరించి కొద్దిసేపు ధ్యానం చేసినా, చిన్నపాటి వ్యాయామాలు చేసినా ఎంతో ఫలితం ఉంటుందని ఆయన చెప్పారు.

టోక్యో.. న్యూయార్క్.. జపాన్ మొదలుకుని ప్రపంచంలో అనేక దేశాల్లో యోగా వేడుకలు ఉత్సాహంగా కొనసాగాయి. టోక్యోలో వర్షం కురుస్తున్నా లెక్క చేయకుండా యోగాసనాలు వేశారు. న్యూయార్క్‌లోని చరిత్రాత్మక టైమ్స్‌స్క్వేర్‌వద్ద వేర్వేరు దేశాలకు చెందిన ఔత్సాహికులు చేరి యోగా చేశారు. రష్యా, చైనా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, ఫిన్లాండ్, మలేసియా, సౌదీ అరేబియా, కెనడా, ఒమన్, డెన్మార్క్, బంగ్లాదేశ్, నేపాల్ తదితర దేశాలన్నీ ఈసారి వేడుకల్లో పాల్గొన్నాయి. భారత దౌత్యవేత్తలు, రాయబార కార్యాలయాల సిబ్బందితోపాటు అనేకమంది ఔత్సాహికులు వీటిలో పాలుపంచుకున్నారు.

# గాంధీ పేరిట విధ్వంసం

## సీఎం రేవంత్‌రెడ్డి నమ్మేది గాడ్సేను.. గాంధీ విగ్రహం పెడతానని దొంగ మాటలు

- గాంధీపై ప్రేమ ఉంటే పేదల ఇండ్లు కూల్చొద్దు.. మహాత్ముడి ఆత్మ ఘోషిస్తుంది
- కాంగ్రెస్ నీచ రాజకీయాలకు బీజేపీ కూడా మద్దతు
- 'చోటే భాయ్.. బడే భాయ్' ఇద్దరూ కలిసి మూసీ భూములు లూటీ
- రాజేంద్రనగర్ కార్యకర్తల సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



హైదరాబాద్/శంషాబాద్, జూన్ 21: గాంధీ మహాత్ముడి పేరుతో సీఎం రేవంత్ చేస్తున్న మూసీ విధ్వంసాన్ని చూస్తే మహాత్ముడి ఆత్మ కూడా ఘోషిస్తుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తన కమీషన్ల కోసం, కాసుల కోసం వేల మంది పేద మధ్యతరగతి ఇండ్లను కూల్చేందుకు రేవంత్‌రెడ్డి చేస్తున్న కుట్రను స్వయంగా మహాత్మా గాంధీ మనుమడు తుషార్ గాంధీ కూడా వ్యతిరేకించారని కేటీఆర్ చెప్పారు. అయినా వినకుండా పేద ప్రజలపైన రేవంత్‌రెడ్డి తన కుట్రలు కొనసాగి స్తున్నారని అన్నారు. గాంధీ మహాత్ముడి విగ్రహం పెడతానంటూ పేదల ఇండ్లు కూలుస్తున్న రేవంత్‌రెడ్డి పైన కేటీఆర్ మండిపడ్డారు. రేవంత్‌రెడ్డి నమ్మేది గాడ్సేను అయినా మహాత్మా గాంధీ విగ్ర హం పెడతానని దొంగ మాటలు చెప్తున్నారని ఆరోపించారు. మహాత్మా గాంధీ పైన నిజంగానే ప్రేమ ఉంటే ప్రజ ల ఇండ్లు కూల్చకుండా ఆయన విగ్రహం కట్టాలని కేటీఆర్ సూచించారు. చివరికి చిన్న పిల్లలు సైతం 'మా ఇండ్లు కూలగొట్టవద్దు.. కిడ్డీ బ్యాంక్ డబ్బులైనా ఇస్తాం. మమ్మల్ని వదిలిపెట్టండి' అని వేడుకుం టే కూడా రేవంత్ మనసు కరగపోగా, దుర్మార్గపు పాలన కొనసాగిస్తున్నారని మండిపడ్డారు. ఆదివారం రాజేంద్రనగర్ నియోజకవర్గంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. మూసీ పేరుతో కాంగ్రెస్ చేస్తున్న విధ్వంసపు రాజకీయాలకు బీజేపీ కూడా మద్ద తు ఇస్తున్నదని ఆరోపించారు. ఒకవైపు ప్రధానమంత్రి మోదీ దగ్గర మాట్లాడుకొని 'చోటే బాయ్.. బడే బాయ్' ఇద్దరు కలిసి మూసీ భూములను కొల్లగొడుతున్నారని విమర్శించారు. నిజంగానే మోదీకి నిజాయతీ ఉంటే పేద ప్రజల భూములు లాక్కోవద్దు, పేద ప్రజలకు అన్యాయం చేయవద్దు అంటూ ఎందుకు ప్రశ్నించరని నిలదీశారు. ఒకవైపు స్థానికంగా బీజేపీ నేతలు పెద్దపెద్ద మాట లు మాట్లాడుతారు.. ఈటల రాజేందర్, కిషన్‌రెడ్డి వచ్చి మూసీ ప్రజలను మోసం చేస్తున్నారని, కానీ వారి సొంత పార్టీ సొంత ప్రభుత్వం మాత్రం ఇండ్లు కూలగొట్టమని అనుమతులు ఇస్తుందన్నారు. గరీబోల ఇం డ్లు కూలగొట్టమని ఇటు రేవంత్‌రెడ్డి, అటు మోదీ దుర్మార్గమైన పనులు చేస్తున్నారని మండిపడ్డారు.

### సీఎం సీటు రెన్యువల్ కోసమే.. ఢిల్లీకి డబ్బుల సంచులు

కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నర సంవత్సరాలు దాటినా.. ఒక్కటంటే ఒక్క హామీ నెరవేర్చేందుకు డబ్బులు లేవని చెబుతున్న రేవంత్‌రెడ్డి మూసీలో మాత్రం రూ.లక్షన్నర కోట్లు ఖర్చు పెట్టడానికి సిద్ధమవుతున్నారని అన్నారు. కేవలం ప్రతి దాంట్లోంచి కమీషన్లు తీసి ఢిల్లీలోని రాహుల్ గాంధీకి ప్రతి నెల పంపడం కోసమే ఇన్ని అరాచకాలు రేవంత్‌రెడ్డి చేస్తున్నారని ఆరోపించారు. ప్రతి నెలా రాహుల్ గాంధీ దగ్గరకు రేవంత్‌రెడ్డి సం చుల కట్టలు పంపి, రెన్యువల్ చేసుకోకుంటే ముఖ్యమంత్రి పదవి పోతుందని ఎద్దేవా చేశారు. మూసీలో ఖర్చు పెడుతున్న లక్షన్నర కోట్లతో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేసే ప్రయత్నం చేయాలన్నారు. ఇప్పటికే కాంగ్రెస్ సినిమా సగం అయిపోయిం దని అది పూర్తి అట్టర్ ఫ్లాప్ సినిమా అన్నారు. ఇప్పుడు నడుస్తున్న రేవంత్‌రెడ్డి సినిమా అట్టర్ ఫ్లాప్ డిజాస్టర్ అని అందరికీ తెలిసిపోయింద న్నారు. ఎప్పుడు రేవంత్ రెడ్డి పోతారా అని ప్రజలు వెయిట్ చేస్తున్నారని కేటీఆర్ పేర్కొన్నారు. కాంగ్రెస్ పోవాలి కేసీఆర్ రావాలన్న ఏకైక ఆలోచన ప్రజల్లో ఉన్నదన్నారు. ఈరోజు రాష్ట్రంలో రాష్ట్ర ప్రభుత్వం లేదని కేవలం ఒక మాఫియా రాజ్యం నడుస్తోందన్నారు. 'అందినంత దోచుకో.. దొరికిన కాడికి దాచుకో' అనే స్కీ ము నడుస్తోందన్నారు. కాంగ్రెస్ పార్టీ దండుపాళ్యం బ్యాచ్‌కి రేవంత్‌రెడ్డి గుంపు మేస్త్రీగా ఉన్నారని, అందుకే అటు రేవంత్‌రెడ్డితో పాటు ప్రతి మంత్రి, కాంగ్రెస్ నాయ కులు అందిన కాడికి దోచుకుంటున్నారని ఆరోపించారు. సామాన్యుల భూములు లాక్కొని గుండాయిజం చేసే రేవంత్ రెడ్డిని, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కొడుకు గుండాయిజాన్ని ప్రతి ఒక్కరూ చూ శారని చెప్పారు. కాంగ్రెస్ కనుసన్నల్లోనే రాజేంద్రనగర్ నియోజకవర్గం శంషాబాద్‌లో 180 ఎకరాల ప్రభుత్వ సీలింగ్ భూ మిని ప్రైవేట్ వారికి రాసిచ్చిన విషయాన్ని కేటీఆర్ గుర్తుచేశారు. స్వయం గా ముఖ్యమంత్రే ప్రతి ఒక్కరినీ బెదిరిస్తూ మంత్రులు పారిశ్రామికవేత్తల తలలకు తుపాకులు పెడుతూ డబ్బులు ఇస్తారా చస్తారా అని బ్లాక్ మెయిల్ చేస్తున్నారని విమర్శించారు.

### ఎంతమంది పోయినా బలంగానే గులాబీ సైన్యం

రెండున్నర సంవత్సరాలుగా హైదరాబాద్ నగరంలో ఒక్క ఇల్లు కూడా కట్టని కాంగ్రెస్ పార్టీ వేలాది ఇండ్లను కూల్చేందుకు మాత్రం సిద్ధమవుతున్నారని కేటీఆర్ ఆరోపించారు. ఉన్న సిటీని వదిలిపెట్టి కేవలం తాను కబ్జా చేసిన వేలాది ఎకరాలను కాపాడుకోవడం కోసమే ఫ్యూచర్ సిటీ పేరుతో రేవంత్‌రెడ్డి ప్రజలను మోసం చేస్తున్నాడని కేటీఆర్ విమర్శించారు. కేవలం తన భూము లు చూసుకోవడానికే ఉనికిలో లేని ఫ్యూచర్ సిటీకి అప్పుడప్పుడు వెళ్లి వస్తున్నారని ఎద్దేవా చేశారు. స్థానిక ఎమ్మెల్యే అభివృద్ధి పేరుతో పార్టీ మారాను అని అన్నారు. కానీ ఈ రెండున్నర సంవత్సరాలలో చేసిన ఒక్క అభివృద్ధి పని అయినా చెప్పగలరా అని ప్రశ్నించారు. ఎంతమంది పెద్దనేతలు పోయి నా గులాబీ సైన్యం బలంగా అలాగే ఉన్నదన్నారు. కచ్చితంగా రానున్న ఎన్నికల్లో కేసీఆర్‌ని తిరిగి ముఖ్యమంత్రిగా తీసుకొచ్చి గులా బీ జెండాను ఎగురవేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పార్టీ సభ్యత్వ నమోదుతో పాటు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఎస్ఐఆర్‌పైన కార్యకర్తలకు కేటీఆర్ దిశానిర్దేశం చేశారు.

### కేసీఆర్ ప్రభుత్వం రాగానే అందరికీ పట్టాలు
### హనుమాన్ నగర్‌కు అండగా బస్తీబాటలో కేటీఆర్

ఇంకో సంవత్సరం ఓపిక పట్టండి.. రాబోయేది మన ప్రభుత్వమే.. కేసీఆర్ ప్రభుత్వమే.. మీ అందరికీ పట్టాలు ఇచ్చే బాధ్యత మాది అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ భరోసా ఇచ్చారు. ఈ ఒక్క సంవత్సరం పాటు మీ ఇండ్లను మీరే కాపాడుకోవాలని, కాంగ్రెస్ నాయకుల మాటలకు మోసపోవద్దు అని కేటీఆర్ పిలుపునిచ్చారు. ఆదివారం రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని హనుమాన్ నగర్‌లో నిర్వహించిన బస్తీ బాట కార్యక్రమంలో కేటీఆర్ స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. దాదాపు 60 సంవత్సరాలుగా హనుమాన్ నగర్ బస్తీలో నివసిస్తున్న ప్రజలు తమను బలవంతంగా తరలించి, ఆ భూములను ప్రభుత్వం విక్రయించేందుకు ప్రయత్నిస్తోం దని కేటీఆర్ దృష్టికి తీసుకువచ్చారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అందజేసిన పట్టాలను కూడా రద్దు చేసి, తమ భూములను లాక్కోవాలని ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లపాటు అధికారం లో ఉన్న సమయంలో హనుమాన్ నగర్ ప్రజల జోలికి ఎవరూ రాలేదని గుర్తు చేశారు. హనుమాన్‌నగర్ బస్తీ మూసీకి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్నప్పటికీ, ప్రజలను భయభ్రాంతు లకు గురిచేస్తూ భూములను స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. స్థానిక ప్రజలు ఐక్యంగా ఉంటే ఈ సమస్యను పరిష్కరించుకోవచ్చని, ఈ ప్రభుత్వానికి ప్రజల సమస్యలను అర్థం చేసుకునే తెలివితేటలు లేవని కేటీఆర్ విమర్శించారు. హైడ్రా పెద్దలకు ఒక నీతి, సామాన్యులకు మరో నీతి అన్నట్లుగా వ్యవహరి స్తోందని కేటీఆర్ ఆరోపించారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే బీఆర్ఎస్ పార్టీ తరఫున గెలిచి, కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లారని, ప్రస్తుతం స్థానిక ప్రజలను బెదిరిం పులకు గురిచేయడం బాధాకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, బస్తీవాసులు పాల్గొన్నారు.

# లెబనాన్‌పై దాడులు ఆపాల్సిందే!

(మొదటి పేజీ తరువాయి)

మొదలు కావాలంటే ముందుగా తాము విధించిన షరతును అమలు చేయాలని పట్టుబట్టింది. స్విట్జర్‌ల్యాండ్‌లోని బర్గన్‌స్టాక్ హోటల్‌లో ఆదివారం పాకిస్థాన్ షరీఫ్, ఖతార్ ప్రధాని షేక్ మొహమ్మద్ బిన్ అబ్దుల్రహమాన్ బిన్ జాసిమ్ అల్ థానీ మధ్యవర్తిత్వంలో ఈ చర్చలు ప్రారంభమయ్యాయి. ఇరాన్ ప్రతినిధి బృందానికి ఆ దేశ పార్లమెంట్ స్పీకర్ మహ్మద్ బాఘేర్ గాలిబాఫ్, విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చి నేతృత్వం వహిస్తున్నారు. అమెరికా ప్రతినిధి బృందానికి ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ నాయకత్వంలో ట్రంప్ ప్రతినిధులు స్టీవ్ విట్కాఫ్, జారెడ్ కుష్నర్ హాజరయ్యారు. మొదటి రౌండ్ చర్చలు 80 నిమిషాలపాటు సాగాయి. ఈ విడతలో ఇరాన్ అణు పరీక్షల ప్రస్తావన రాలేదు. కేవలం లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులపైనా ప్రధానంగా చర్చ జరిగింది. ఆ తర్వాత అంతర్గత సంప్రదింపుల కోసం చర్చలకు విరామం ప్రకటించారు. మొదటి రౌండ్ చర్చల విరామం తర్వాత




ఇరాన్, ఖతార్ ప్రతినిధులు విడిగా సమావేశమయ్యారు. రెండో విడత చర్చల్లో ఇరాన్ అణు పరీక్షలు, హోర్ముజ్ జలసంధిని తిరిగి తెరిచే అంశాలపై చర్చలు జరుగుతాయని సమాచారం.ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చి చర్చల ప్రారంభంలో పాకిస్థాన్ ప్రధాని షరీఫ్‌ను ఆలింగనం చేసుకున్నారు. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్‌తో మాత్రం ఎలాంటి సంభాషణ జరుపలేదు. అమెరికా ప్రతినిధులతో సంయుక్తంగా ఫొటోలు దిగేందుకు ఇరాన్ బృందం ఏమాత్రం ఆసక్తి చూపలేదు. సున్నితంగా ఆ అభ్యర్థనను ఇరాన్ బృందం తిరస్కరించింది. చర్చల ప్రారంభానికి ముందు జేడీ వాన్స్ మాట్లాడుతూ హోర్ముజ్ జలసంధిని తెరవడం, ఇరాన్ అణు కార్యక్రమానికి ముగింపుపై చర్చలు సాగుతాయని చెప్పుకొచ్చారు.

### లెబనాన్‌లో ప్రాక్సీలను నిలువరించాలి: ట్రంప్

స్విట్జర్‌ల్యాండ్‌లో శాంతి చర్చలు జరుగుతున్న వేళ ఇరాన్‌కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరికలు జారీ చేయడం చర్చలను ప్రభావితం చేసింది. లెబనాన్‌లో ముందుగా ఇరాన్ ప్రాక్సీలను నిలువరించాలని ట్రంప్ తన 'ట్రూత్ సోషల్'లో పోస్టు పెట్టారు. ఈ వ్యాఖ్యలపై ఇరాన్ ప్రతినిధులు భగ్గుమన్నారు. ట్రంప్ వ్యాఖ్యలపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.



# ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం వేడుకలు

**నిర్మల్ జిల్లా ప్రతినిధి, జూన్ 21(ప్రజాతీర్పు ):**

నిర్మల్ పట్టణంలోని అంబేద్కర్ భవన్లో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు ఆదివారం ఉదయం ఘనంగా నిర్వహించారు. ఈ యోగ వేడుకలలో భాగంగా యోగా శిక్షకులు, ప్రతి యోగాసనం యొక్క ఉపయోగం తెలుపుతూ కార్యక్రమానికి హాజరైన వారితో వివిధ రకాల యోగాసనాలు వేయించారు.యోగ దినోత్సవం రోజు ప్రపంచం మొత్తం యోగాను ఆచరిస్తుందని, ప్రజలంతా నిత్యజీవితంలో యోగాను భాగస్వామ్యం చేసుకోవాలని పిలుపునిచ్చారు. యోగ సాధనతో ఎన్నో రకాల మొండి వ్యాధులు కూడా నయమవుతాయని అన్నారు. యోగాతో, శారీరక మానసిక ఉల్లాసం కలుగుతుందని వివరించారు. ప్రతిరోజు కొద్ది సమయం యోగాకి కేటాయించడం వల్ల ఎటువంటి అనారోగ్య సమస్యలు దరిచేరవని తెలిపారు. ఈ అంతర్జాతీయ యోగా దినోత్సవం వేడుకల్లో డిఇఓ భోజన్న, డివైఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, నోడల్ అధికారి సత్యనారాయణరావు, ఇతర అధికారులు, సిబ్బంది, శిక్షకులు, పట్టణవాసులు, తదితరులు పాల్గొన్నారు.



# బుద్ధారం తండాలో.. కార్డెన్ సెర్చ్...

- గార్ల.. బయ్యారం సిఐరవీందర్ యాదవ్, గార్ల ఎస్సై బి సాయికుమార్ ఆధ్వర్యంలో..

**(పగడాల రామారావు ప్రజా తీర్పు గార్ల మండల ప్రతినిధి) 21**

గార్ల. స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలోని బుద్ధారం గ్రామంలో నిర్వహించిన కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం కింద ఆదివారం గార్ల, బయ్యారం, సి.ఐ రవీందర్, ఆధ్వర్యంలో, పోలీసు సిబ్బందితో కలిసి బుద్ధారం గ్రామంలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా చేపట్టిన చర్యలు అవగాహన కార్యక్రమాల నిర్వహించారు. ఈ కార్డన్ సెర్చ్లో అక్రమంగా నిల్వ ఉంచిన 20 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకోవడం జరిగింది.200 లీటర్ల బెల్లపు ఊటను (జీుస్త్రస్త్రవతీఎ ఝుంప్త్ర) గుర్తించి, అక్కడికక్కడే ధ్వంసం చేయడం జరిగిందవాహనాల తనిఖీ: సరైన పత్రాలు మరియు నంబర్ ప్లేట్లు లేని 60 వాహనాలను (బైకులు మరియు ఆటోలు) గుర్తించి, తగిన చర్యలు చేపట్టడం జరిగింది.గ్రామస్తులకు కల్పించిన అవగాహన (ాఝుతీవఅవం ఝుఎజాుఝుఅస్త్రఅం): ప్రజలలో భద్రతా స్పృహ పెంపొందించేందుకు ఈ క్రింది అంశాలపై అవగాహన కల్పించాము:సైబర్ క్రైమ్స్: ఆన్లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని మరియు అనుమానాస్పద లింక్లను క్లిక్ చేయవద్దని సూచించాము. యాంటీ-గంజా ప్రచారం: గంజా వల్ల కలిగే అనర్థాల గురించి వివరిస్తూ, సమాజంలో గంజా రహిత వాతావరణం కోసం ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరాము. సిసిటివి కెమెరాల ప్రాముఖ్యత: నేరాల నియంత్రణలో మరియు భద్రతలో సిసిటివి కెమెరాలు ఎంత కీలకమో వివరిస్తూ, ప్రతి ఒక్కరూ వాటి ఏర్పాటుకు ముందుకు రావాలని సూచించామని గార్ల ఎస్సై బి,సాయి కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

# యోగాను నిత్య జీవితంలో భాగం చేసుకోవాలి

- యోగాతో ఒత్తిడికి ఉపశమనం.. ఆరోగ్యానికి భరోసా :
- రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

**(వి వెంకటేష్ ప్రజాతీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) జూన్ 21**



నేటి జీవన విధానంలో మనిషి అనేక ఒత్తిళ్లకు గురవుతున్నాడని, యోగా ద్వారా వాటి నుంచి ఉపశమనం పొందవచ్చని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు.ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని రామగుండం పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో పోలీస్ పరేడ్ మైదానంలో యోగా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పోలీస్ కమిషనర్, అధికారులు, సిబ్బందికి యోగా దినోత్సవ శుభాకాంక్షలు,తెలియజేశారు. యోగా అనేది ఒకరోజు నిర్వహించే కార్యక్రమం కాదని, ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాల్సిన ఆరోగ్య సాధనమని,పేర్కొన్నారు. యోగా చేయడానికి ప్రత్యేకమైన పరికరాలు గానీ, ఇతరుల సహకారం గానీ అవసరం లేదని, వ్యక్తిగత నిబద్ధత, సంకల్పం ఉంటే సరిపోతుందని,అన్నారు. ఆరోగ్యమే మహాభాగ్యమని, మంచి ఆరోగ్యం మనిషికి అత్యంత విలువైన ఆస్తి అని పేర్కొన్నారు. జీవితంలో ఎంతటి ఉన్నత స్థానాలు సాధించినా,ఎంతటి సంపద సంపాదించినా వాటిని ఆనందించడానికి ఆరోగ్యవంతమైన శరీరం అవసరమని,తెలిపారు. అందుకే ప్రతి ఒక్కరూ ప్రతిరోజూ యోగా సాధన చేయడంతో పాటు కుటుంబ సభ్యులు, స్నేహితులు, సహచరులను కూడా యోగా చేయడానికి ప్రోత్సహించాలని సూచించారు.పోలీస్ సిబ్బంది సాధారణంగా శారీరక దృఢత్వానికి అధిక ప్రాధాన్యత ఇస్తారని, కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్న యువ పోలీస్ సిబ్బందిని అభినందించారు. యువత తమ శారీరక మానసిక ఆరోగ్యంపై మరింత శ్రద్ధ చూపాలని, ప్రస్తుతం అందరూ మంచి ఫిట్నెస్తో ఉన్నారని, భవిష్యత్తులో కూడా అదే స్థాయిని కొనసాగించాలని సూచించారు.యోగా ఒకరోజుతో పరిమితం కాకుండా నిత్య జీవితంలో భాగం కావాలని,యోగా దినోత్సవానికే పరిమితం చేయకుండా ప్రతి పదిహేను రోజులకు ఒకసారి శాఖల స్థాయిలో ఇటువంటి శిక్షణా కార్యక్రమాలు నిర్వహించి సిబ్బందిలో అవగాహన పెంపొందించాలని అధికారులను ఆదేశించారు.యోగాతో ప్రశాంతమైన మనస్సు, ఆరోగ్యవంతమైన శరీరం లభిస్తాయని, మానసిక ప్రశాంతతకు,శారీరక దృఢత్వానికి యోగా ఉత్తమ సాధనమని పోలీస్ కమిషనర్ పేర్కొన్నారు.నిత్య యోగా సాధన ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవడంతో పాటు మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉండవచ్చని తెలిపారు.ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థకు చెందిన యోగా శిక్షకుల ఆధ్వర్యంలో పోలీస్ కమిషనర్తో పాటు అధికారులు, సిబ్బంది యోగా ఆసనాలను అభ్యసించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ కె.శ్రీనివాస్, గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్,స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ నాగేంద్ర గౌడ్ గోదావరిఖని వన్టౌన్ ఇన్స్పెక్టర్ అఫ్జలోద్దీన్, రామగుండం సీఐ కృష్ణకుమార్,ఆర్ఐలు దామోదర్,మల్లేశం, శేఖర్,రమేష్, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ యోగా శిక్షకురాలు రాధిక,తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# యోగాతో ఆరోగ్య వంతమైన సమాజం సాధ్యం...

## జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్

**( గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్ ) జూన్ 21.**

అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఆదివారం ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా కార్యక్రమంలో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్తో కలిసి జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల సిబ్బంది యోగా సాధనలో పాల్గొని యోగా ప్రాముఖ్యతను వివరించారు. ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మాట్లాడుతూ యోగాభ్యాసంతో ఆరోగ్యవంతమైన సమాజం సాధ్యమవుతుందని అన్నారు. యోగా శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతతను కూడా అందిస్తుందని, ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో యోగాను భాగం చేసుకోవాలని సూచించారు. ప్రపంచవ్యాప్తంగా యోగాకు లభిస్తున్న ఆదరణ భారతీయ సంస్కృతి గొప్పతనానికి నిదర్శనమని పేర్కొన్నారు. నేటి ఒత్తిడితో కూడిన జీవనశైలిలో యోగా ఎంతో ఉపయుక్తమని, యువత ఆరోగ్య పరిరక్షణకు యోగాభ్యాసం ఎంతో దోహదపడుతుందని తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారందరూ వివిధ యోగా ఆసనాలు, ప్రాణాయామం సాధించారు. యోగా ద్వారా ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ యోగా అనేది భారతదేశం ప్రపంచానికి అందించిన గొప్ప సంపద అని పేర్కొన్నారు. యోగా సాధన ద్వారా శారీరక ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు మానసిక ప్రశాంతత, ఏకాగ్రత పెరుగుతాయని తెలిపారు. ప్రస్తుత జీవనశైలిలో ఒత్తిడి, అనారోగ్య సమస్యలను అధిగమించేందుకు యోగా ఎంతో ఉపయోగకరమని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్ఓ) డాక్టర్ సుజాత, ఆయుష్ శాఖ అధికారులు, సిబ్బంది, మున్సిపల్ చైర్మన్ సమిండ్ల వాణి, వివిధ శాఖల అధికారులు, పాల్గొన్నారు.



# విజ్ డమ్ హైస్కూల్ లో ఘనంగా జరిగిన అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు

**నర్సంపేట, జూన్ 21, ప్రజా తీర్పు ప్రతినిధి:**

అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా 10 తెలంగాణ బెటాలియన్, ఎన్సీసీ వరంగల్ ఆధ్వర్యంలో నర్సంపేట పట్టణంలోని విజ్ డమ్ హైస్కూల్ లో వివిధ పాఠశాలలు, కళాశాలలకు చెందిన సుమారు 320 మంది ఎన్సీసీ క్యాడెట్లు పాల్గొని యోగా దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యోగా గురువు ప్రసాద్ యోగా వల్ల కలిగే శారీరక, మానసిక ప్రయోజనాలను వివరిస్తూ పలు రకాల ఆసనాలను విద్యార్థులచే చేయించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం శివజ్యోతి మాట్లాడుతూ ధ్యానం (మెడిటేషన్) యొక్క ప్రాముఖ్యతను, దాని ద్వారా లభించే మానసిక ప్రశాంతతను వివరించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో విజ్ డమ్ హై స్కూల్ డైరెక్టర్ జావేద్, కరస్పాండెంట్ జహంగీర్ పాల్గొని మాట్లాడుతూ యోగాను ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని, ప్రతి రోజూ యోగా చేయడం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడిఆరోగ్యవంతమైన జీవనం అలవడుతుందని పేర్కొన్నారు.ఈకార్యక్రమంలో హవల్దార్ కమలాకర్, విజ్ డమ్ హై స్కూల్ ఎన్సీసీ సెకండ్ ఆఫీసర్ ప్రశాంత్ కుమార్, బాలాజీ టెక్నో స్కూల్ సెకండ్ ఆఫీసర్ రియాజుద్దీన్, శివానీ పబ్లిక్ స్కూల్ సెకండ్ ఆఫీసర్ రాజు, సైనిక్ స్కూల్ లెఫ్టినెంట్ కిరణ్, డఫోడిల్స్ హై స్కూల్ సీటీఓ వెంకటరత్నం, గీతాంజలి హై స్కూల్ వెంకన్న, విజ్ డమ్ హై స్కూల్ వీరభద్రయ్య, పిఈటి లు రియాజ్, రాజేష్ , మధు, అనూప తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.కార్యక్రమం ముగింపులో వక్తలు మాట్లాడుతూ, "యోగ ఆరోగ్యకరమైన జీవనానికి మూలాధారం. ప్రతి ఒక్కరూ యోగాను తమ నిత్య జీవితంలో భాగంగా చేసుకుని ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి తోడ్పడాలి" అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం ఉత్సాహ భరిత వాతావరణంలో విజయవంతంగా ముగిసింది.

# మనసులు దగ్గరైతే... సమస్యలు దూరమవుతాయా?

ఒక ఆహ్లాదకరమైన సాయంత్రం వేళ, పక్కింటి రాములు గారు తన భార్యతో కలిసి వరండాలో ప్రశాంతంగా కూర్చుని ఏదో మాట్లాడుకుంటున్నారు. నిజానికి వారి ఇంట్లో ఆర్థిక ఇబ్బందులు తక్కువగా ఏమీ లేవు. పిల్లల పైచదువుల ఖర్చులు, నానాటికీ పెరిగిపోతున్న నిత్యావసర వస్తువుల ధరలు, నెలవారీ అవసరాలు ఇలా సమస్యలు కొండంత ఉన్నాయి. అయినప్పటికీ, వారిద్దరి మొహాల్లో మాత్రం ఒక తెలియని నిబ్బరం, పెదవులపై చిరునవ్వు కనిపిస్తోంది. మనం ఇద్దరం కలిసి ఆలోచిస్తే ఏదో ఒక మంచి దారి తప్పకుండా దొరుకుతుంది అన్న భరోసా వారి మాటల్లో స్పష్టంగా ధ్వనిస్తోంది. ఈ దృశ్యాన్ని గమనించిన ఏ ఒక్కరికైనా మనసులో ఒక ప్రాథమిక ప్రశ్న తలెత్తక మానదు నిజంగా మనుషుల మధ్య మనసులు దగ్గరైతే జీవితంలోని సమస్యలన్నీ దూరమవుతాయా? లేక సమస్యలు వాటి దారిన అవి ఉంటూ, కేవలం మనసుల అనుబంధం మాత్రమే వేరుగా నిలుస్తుందా? ఈ లోతైన ప్రశ్నకు సరైన సమాధానం వెతకాలంటే, ముందుగా అసలు మనసు దగ్గరవ్వడం అనే మాట వెనుక ఉన్న వాస్తవ అర్థాన్ని మనం నిశితంగా పరిశీలించాల్సి ఉంటుంది.ఇద్దరు వ్యక్తుల మధ్య మనసు దగ్గరవ్వడం అంటే కేవలం ఒకే ఇంట్లో కలిసి జీవించడం లేదా పక్కపక్కన కూర్చోవడం కాదు. ఒకరి అంతరంగంలోని బాధను మరొకరు ఎలాంటి అపోహలు లేకుండా అర్థం చేసుకోవడం, పైకి మాట్లాడకుండానే కళ్లలోని భావాలను, నిశ్శబ్దాన్ని గ్రహించగలగడం, పూర్తి నమ్మకంతో ఏ విషయాన్నైనా నిర్భయంగా పంచుకోగలగడం ఇదే నిజమైన మానసిక సాన్నిహిత్యం. భార్యాభర్తల మధ్య అయినా, తల్లిదండ్రులు మరియు పిల్లల మధ్య అయినా, ఆత్మీయ స్నేహితుల మధ్య అయినా, లేదా తోటి సహోద్యోగుల మధ్య అయినా ఈ బలమైన మానసిక అనుబంధం ఉంటే జీవితంలో ఎదురయ్యే ఎన్నో క్లిష్టమైన విషయాలు చాలా సులభంగా సాగిపోతాయని మన పెద్దలు చెబుతుంటారు. మనసు మంచిదైతే మాటలు ఎందుకు అన్న సామెత కూడా ఈ అంతర్గత అవగాహనను ఉద్దేశించిందే.

దీన్ని నిజం చేస్తూ సమాజంలో చాలా సందర్భాల్లో మనం చూస్తుంటాం. ఇద్దరి మధ్య సరైన అవగాహన, పరస్పర గౌరవం ఉంటే ఎంతటి పెద్ద వివాదాలైనా చిన్న చిన్న తగాదాలుగా మారి సర్దుకుపోతాయి. ఒకవేళ తీవ్రమైన కోపంలో ఏదైనా అనాలోచిత మాట అన్నా, అది అవతలి వారి మనసులో శాశ్వతమైన గాయంగా మిగిలిపోదు. ఒకరి తప్పులను మరొకరు పెద్ద మనసుతో క్షమించే గుణం, బంధాన్ని నిలబెట్టుకోవాలనే తాపత్రయం అక్కడ స్పష్టంగా కనిపిస్తాయి. ప్రతి కుటుంబంలోనూ కాలంతో పాటు రకరకాల డబ్బు సమస్యలు రావచ్చు, అకస్మాత్తుగా ఆరోగ్య భంగాలు కలగవచ్చు, లేదా ఉద్యోగ రీత్యా తీవ్రమైన ఒత్తిళ్లు ఎదురుకావచ్చు. ఇవన్నీ జీవితంలో సహజమైన భాగాలు. అయితే, ఇలాంటి క్లిష్ట సమయాల్లో ఏ కుటుంబంలోనైతే మనసులు ఒకరికొకరు దగ్గరగా ఉంటాయో, వారు ఆయా సమస్యలను ఒక ఉమ్మడి శత్రువులా భావించి కలిసికట్టుగా ఎదుర్కొంటారు. ఒకరిపై ఒకరు నిందలు వేసుకుంటూ కాలాన్ని వృథా చేయరు. ఏమి జరిగినా మనం కలిసి దీన్ని పరిష్కరిద్దాం అనే దృఢమైన భావనతో ముందుకు సాగుతారు. దీనివల్ల సమస్య తీవ్రత మానసికంగా చాలా తగ్గినట్టు అనిపిస్తుంది. ఎందుకంటే ఆ కష్టాల భారం ఒక్కరిపైనే పడకుండా, అందరి మధ్య సమానంగా పంచుకోబడుతుంది.అదే సమయంలో, మనసులు దూరమైన కుటుంబాల్లో పరిస్థితి దీనికి పూర్తిగా భిన్నంగా ఉంటుంది. అక్కడ చిన్నపాటి సమస్య కూడా చివరకు పెద్ద గొడవగా మారిపోతుంది. సరైన సంభాషణ (కమ్యూనికేషన్) లేకపోవడం వల్ల అపార్థాలు రోజురోజుకూ పెరిగిపోతాయి. దీనివల్ల అసలు సమస్య పక్కకుపోయి, ఒకరిపై ఒకరికి క్రోధం, అలక, మానసిక దూరం పెరుగుతాయి. కేవలం ఇగోల వల్లే చిన్న ఆర్థిక ఇబ్బంది కూడా చివరకు కోర్టు మెట్లు ఎక్కేలా, విడాకుల వరకు దారితీసేలా చేసిన ఎన్నో చేదు నిజాలను మనం నిత్యం చూస్తూనే ఉన్నాం.ఇక్కడ ప్రాక్టికల్ గా ఒక విషయాన్ని మనం స్పష్టంగా అర్థం చేసుకోవాలి. కేవలం మనసులు దగ్గరవ్వడం వల్ల సమాజంలో ఉండే లౌకిక



**డా.సూర్యదేవర రామకృష్ణ ,**
**9490754169**

సమస్యలు పూర్తిగా గాల్లో కలిసిపోవు. ఉదాహరణకు, ఒక కుటుంబంలో తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు ఉంటే, ఆ భార్యాభర్తలు ఒకరినొకరు ఎంత ప్రాణంగా ప్రేమించుకున్నా, బ్యాంకులో ఉన్న అప్పు దానంతట అదే తీరిపోదు. ఉద్యోగం పోయినప్పుడు ఇద్దరి మనసులు ఎంత ఒకేలా ఆలోచించినా, బయటకు వెళ్లి కొత్త ఉద్యోగం వెతుక్కోవాల్సిందే. అనారోగ్యం వస్తే ఆసుపత్రికి వెళ్లి వైద్యం చేయించుకోవాల్సిందే.కానీ, ఈ శారీరక, ఆర్థిక సమస్యలను అనుభవించే తీరులో మాత్రం మనసుల అనుబంధం ఒక అద్భుతమైన తేడాను తీసుకొస్తుంది. సమాజంలో ఒంటరిగా పోరాడి అలసిపోయే వ్యక్తికి, పక్కన నిలబడి తనను గుండెల్లో దాచుకునే ఒక ఆత్మీయుడు ఉన్నాడనే నమ్మకం లభిస్తే కొండంత ధైర్యం వస్తుంది. దీనివల్ల మెదడుపై ఉండే మానసిక ఒత్తిడి విపరీతంగా తగ్గుతుంది. ఈ ప్రపంచంలో నేను ఒంటరిని కాను, నా వెనుక నా వారు ఉన్నారు అనే అమూల్యమైన భావన కలిగించడమే బంధాల యొక్క గొప్పతనం. సమస్యలు భౌతికంగా వెంటనే దూరం కాకపోయినా, వాటిని మోసే గుండె ధైర్యం పెరుగుతుంది. మనసులు దగ్గరగా ఉన్నవారు తమ మనసులోని భయాలను, ఇబ్బందులను దాచుకోకుండా ఒకరితో ఒకరు పంచుకుంటారు. దీనివల్ల సమస్యలు ముదిరిపోకముందే, ప్రారంభ దశలోనే గుర్తించబడి పరిష్కారాలు దొరుకుతాయి. ఒకరి సామర్థ్యంపై మరొకరికి పూర్తి నమ్మకం ఉన్నప్పుడు, జీవితంలో వచ్చే తాత్కాలిక అపజయాలను ఓర్పుతో తట్టుకునే మానసిక శక్తి లభిస్తుంది. కుటుంబంలో లేదా సమాజంలో అందరూ కలిసి ఒకేలా ఆలోచిస్తే, భారం ఒక్కరిపైనే పడదు. వేర్వేరు కోణాల నుండి ఆలోచించి ఉత్తమమైన పరిష్కార మార్గాలు వెతకగలుగుతారు. నిరంతరం ప్రేమ, ఆదరణ, లాలన ఉన్న వాతావరణంలో ఒత్తిడి, ఆందోళన వంటి రుగ్మతలు దరిచేరవు. ఇది పరోక్షంగా మనిషి యొక్క పనితీరును, ఆలోచనా సామర్థ్యాన్ని మెరుగుపరుస్తుంది.కష్టకాలంలో ఒకరికొకరు తోడుగా నిలబడిన ఆ చేదు, తీపి అనుభవాలు ఆయా బంధాన్ని భవిష్యత్తులో మరింత దృఢంగా మారుస్తాయి.ఇక్కడ మనం నాణేనికి ఉన్న రెండో వైపును కూడా తప్పక పరిశీలించాలి. కేవలం మనసులు దగ్గరగా ఉండి, ఒకరినొకరు బాగా అర్థం చేసుకుంటేనే జీవితం సాఫీగా సాగిపోదు. దానితో పాటు ఖచ్చితమైన ఆచరణాత్మక ప్రయత్నాలు, శ్రమ కూడా ఎంతో అవసరం. ఎంత గాఢమైన ప్రేమ ఉన్నా, సరైన ఆర్థిక ప్రణాళిక లేకపోతే అప్పుల ఊబి నుండి బయటపడలేరు. సరైన వైద్య సహాయం తీసుకోకపోతే కేవలం ప్రేమతోనే వ్యాధి నయం కాదు. అలాగే, నిరంతర శ్రమ, నైపుణ్యం లేకపోతే కేవలం ఆత్మీయతతో ఉద్యోగం రాదు.అంటే, మనసుల అనుబంధం అనేది ఒక అందమైన ఇల్లు కట్టడానికి అవసరమైన గట్టి పునాది లాంటిది మాత్రమే. ఆ పునాదిపై ఇటుకలు పేర్చి నిర్మాణం చేయాల్సింది నిరంతర శ్రమతో మనమే. పునాది బలంగా ఉండటం వల్ల ఆ ఇల్లు సులభంగా, ఎంతో కాలం నిలుస్తుంది. అంతేకానీ కేవలం పునాది వేసి వదిలేస్తే ఇల్లు దానంతట అదే గాల్లో నిర్మితమవదు కదా! కొందరు ఈ మనసుల అనుబంధాన్ని ఒక సాకుగా మార్చుకుని, వాస్తవ ప్రపంచంలోని సమస్యలను, బాధ్యతలను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తుంటారు. మేమిద్దరం ఎంతో ప్రేమగా ఉన్నాం కదా, కాలమే అన్నింటినీ సర్దుబాటు చేస్తుంది అనుకుని కూర్చుంటే, చివరకు ఆ సమస్యల లౌకిక ఒత్తిడి పెరిగిపోయి, ఎంతో కాలంగా ఉన్న ఆ మనసుల అనుబంధాన్ని కూడా ముక్కలు చేస్తుంది. కాబట్టి ఉదాత్తమైన మనసుతో పాటు, పక్కా ప్రణాళిక, కఠిన శ్రమ, సరైన సమయంలో నిర్ణయాత్మక చర్యలు తీసుకోవడం కూడా అంతే ముఖ్యం.చివరగా చెప్పాలంటే, సమాజంలో మనసులు దగ్గరైతే సమస్యలు భౌతికంగా పూర్తిగా మాయమైపోవు. కానీ, వాటిని ధీటుగా ఎదుర్కొనే ఆత్మవిశ్వాసం, గుండె ధైర్యం, ఓరిమి మాత్రం సమాజంలో రెట్టింపు అవుతాయి. మనసుల అనుబంధం అనేది సమస్యలను తరిమికొట్టే ఒక అద్భుత మంత్రదండం ఎంతమాత్రం కాదు. కానీ, ఆ సమస్యల బరువును పంచుకునే ఒక నమ్మకమైన భుజం మాత్రం తప్పక అవుతుంది.ఒక నిజమైన, ఆదర్శవంతమైన బంధం అంటే జీవితంలో ఎన్నడూ ఏ కష్టాలు, నష్టాలు రాకుండా చూసుకోవడం కాదు. కష్టాలు ఏ రూపంలో విరుచుకుపడినా సరే, వెనకడుగు వేయకుండా ఇద్దరూ ఒకరి చేతిని మరొకరు పట్టుకుని చివరివరకు ధైర్యంగా నిలబడటమే. మనసులు దగ్గరగా ఉంటే ఆ నిలబడే శక్తే మనల్ని విజయ తీరాలకు చేరుస్తుంది. కాబట్టి నేటి యాంత్రిక జీవనంలో, మీ చుట్టూ ఉన్న ఆత్మీయులతో, కుటుంబ సభ్యులతో సమయం కేటాయించి మనసు విప్పి మాట్లాడండి. వారి చిన్న చిన్న బాధలను ఓపికగా అర్థం చేసుకోండి. జీవితంలో సమస్యలు ఎప్పుడూ ఉంటూనే ఉంటాయి, కానీ మనసులు దగ్గరగా ఉంటే వాటిని దాటడానికి ఒక చక్కని మార్గం ఖచ్చితంగా దొరుకుతుంది. ఎందుకంటే, ఈ సృష్టిలో చివరికి మనిషిని ప్రాణంతో నిలబెట్టేది కేవలం బ్యాంక్ బ్యాలెన్స్ మాత్రమే కాదు, అంతకుమించిన మనసుల అనుబంధం, ఆత్మీయత మాత్రమే!.

# కష్టకాలంలో తోడుగా బిర్రం టీమ్

- భారీ వర్షాలకు ఇల్లు కోల్పోయిన కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సాయం
- సున్నం దేవికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి



**అశ్వారావుపేట,జూన్ 21,(ప్రజా తీర్పు )**

అశ్వారావుపేట మండలం వినాయకపురం గ్రామ పంచాయతీ పరిధిలోని దబ్బాతోగు కాలనీలో నివాసం ఉంటున్న సున్నం దేవి ఇల్లు ఇటీవల కురిసిన భారీ వర్షాలు, బలమైన గాలుల కారణంగా కూలిపోవడంతో ఆమె కుటుంబం తీవ్ర ఇబ్బందులకు గురైంది. విషయం తెలుసుకున్న వెంటనే సేవా కార్యక్రమాల్లో ముందుండే బిర్రం టీమ్ స్పందించి బాధిత కుటుంబానికి అండగా నిలిచింది. బాధిత కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న బిర్రం టీమ్ సభ్యులు స్వచ్ఛందంగా విరాళాలు సేకరించి రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సహాయంతో కుటుంబానికి కొంత ఊరట కలిగిందని స్థానికులు తెలిపారు. గ్రామ ప్రజలు మాట్లాడుతూ, కష్టకాలంలో ప్రజలకు అండగా నిలవడం బిర్రం టీమ్ ప్రత్యేకత అని కొనియాడారు. ఎలాంటి స్వార్థం లేకుండా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ గ్రామ ప్రజల ఆదరణను పొందుతున్న ఈ బృందం సామాజిక బాధ్యతకు నిదర్శనంగా నిలుస్తోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ, గాలి, వర్షాల కారణంగా నివాసాన్ని కోల్పోయిన సున్నం దేవి కుటుంబ పరిస్థితిని ప్రభుత్వం మానవతా దృక్పథంతో పరిశీలించి వెంటనే ఇందిరమ్మ గృహ పథకం కింద ఇల్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ప్రకృతి విపత్తుల కారణంగా ఇళ్లను కోల్పోయిన నిరుపేద కుటుంబాలకు ప్రత్యేక సహాయం అందించాలని కోరారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి సున్నం దేవి కుటుంబానికి అర్హత మేరకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఉప్పల ప్రసాద్, మురళి, నాగమహేశ్వరరావు, లోకం సాంబశివరావు, పొట్టరాజులు మారుతి, రామకృష్ణ, లక్ష్మణరావు, బిర్రం ఉదయకుమార్, రామినేని సురేష్, దిడ్డి వీరబాబు, గాలి రాంబాబు, గెద్దం చిట్టిబాబు, ఉప్పల దుర్గాప్రసాద్, వెంకటరమణ, రొయ్యల సత్యనారాయణ, అల్లం శివగణేష్, మాజీ సర్పంచ్ కన్నమ్మ, చింపాప్ప జోగమ్మ తదితరులు పాల్గొని బాధిత కుటుంబానికి ధైర్యం చెప్పారు. బాధితులకు అండగా నిలుస్తూ, అవసరమైన చోట సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న బిర్రం టీమ్ సేవా స్ఫూర్తి గ్రామ ప్రజలకు ఆదర్శంగా నిలుస్తోందని పలువురు అభిప్రాయపడ్డారు.



# జయశంకర్ ఉద్యమ స్ఫూర్తి చిరస్మరణీయం

**మాజీ మంత్రి టి. జీవన్ రెడ్డి...**

**( గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్ ) జూన్ 21.**

జగిత్యాల జిల్లా కేంద్రంలో ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని నివాళులు అర్పించారు. మాజీ మంత్రి, బి ఆర్ ఎస్ పార్టీ జనరల్ సెక్రెటరీ తాటిపర్తి జీవన్ రెడ్డి .మాజీ జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత సురేష్ . మరియు బి ఆర్ ఎస్ శ్రేణులు. జీవన్ రెడ్డి మాట్లాడుతూ... ప్రొఫెసర్ ఆచార్య జయశంకర్ వర్ధంతి పురస్కరించుకొని ఆదివారం జగిత్యాల బి ఆర్ ఎస్ పార్టీ శ్రేణులతో కలిసి నివాళులు అర్పించారు. జయశంకర్ ఉద్యమ స్ఫూర్తి ఒక విధంగా ఉద్యమానికి వారే మార్గదర్శకం అని చెప్పక తప్పదు. తొలితరం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఉద్యమం నుండి మలిదశ ఉద్యమం వరకు కేసీఆర్ గారి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సాధన కొరకు వారికి ఒక మార్గదర్శకుడిగా నిలిచారు. కెసిఆర్ గారు వారి పదవులు త్యాగం చేసిన సందర్భంగా వారు రాజకీయ పార్టీ ఆవిర్భావం చేసినప్పుడు దశా దిశా నిర్దేశం చేసే విధంగా ప్రొఫెసర్ జయశంకర్ మార్గదర్శకులుగా నిలవడం జరిగింది. విద్యార్థి దశ నుండి తెలంగాణ రాష్ట్రం ప్రత్యేక రాష్ట్రంగా గుర్తింప పడ్డప్పుడు మాత్రమే ప్రాంతం అభివృద్ధి చెందుతుంది అని భావన కలిగి ఉన్నటువంటి నాయకులు ప్రొఫెసర్ జయశంకర్ గారు వారు ఆనాడు హైదరాబాద్. ఉమ్మడి రాష్ట్రం నుండి తెలంగాణ ప్రాంతం ఆంధ్ర రాష్ట్రంలో విలీనం వ్యతిరేకించడం జరిగింది 69 లో ఉద్యమం కానీ మలిదశ చివరి ఉద్యమంలో కెసిఆర్ గారి నాయకత్వంలో ఉద్యమ బలపేతానికి మార్గదర్శకులుగా నిలిచినటువంటి జయశంకర్ యావత్ తెలంగాణ జాతికి జాతిపితగా మనం భావించడం జరుగుతుంది వారి ఆశయాలకు అనుగుణంగా ఏ నిధులు నీళ్లు నియామకాలు ప్రధాన లక్ష్యంగా ఎంచుకొని ఉద్యమం ప్రారంభింప చేయడం జరిగిందో అందులో భాగంగా గత దశాబ్ద కాలం కేసీఆర్ రెండు పర్యాయాలు ముఖ్యమంత్రిగా ఈ ప్రాంతానికి చెందిన నీళ్ల హక్కుల పొందడంలో కానీ ఉద్యోగాల కల్పన లో కాని సమకూర్పంలో కానీ వారు చేయని కృషి లేదు కేవలం ఆశల పల్లకిలో ఊరేగింప చేసే విధంగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటికీ ఈ 30 మాసాల కాలంలో వారు చేసిన వాగ్దానాలు అమలు చేయలేకపోవడం కాకుండా ఆనాడు కెసిఆర్ అమలు చేసిన కార్యక్రమాలు అన్నీ కూడా నిర్వీర్యం చేసే విధంగా కుట్రలు చేయడం దురదృష్టకరం తెలంగాణ రాష్ట్రం తిరిగి కెసిఆర్ నాయకత్వంలో వారి ఆధ్వర్యంలో మాత్రమే పునర్నిర్మాణం చేయగలుగుతుంది అనే విశ్వాసాన్ని వ్యక్తం చేస్తు ఆచార్య జయశంకర్ గారికి నివాళులు అర్పిస్తున్నాను.

## ఎరువుల డిజిటల్ 'యూరియా యాప్'ను వెంటనే రద్దు చేయాలని చిట్టిమాల నాగరాజు డిమాండ్

**(వంజరపు) ఎల్లం ప్రజా తీర్పు ప్రతినిధి మాసాయిపేట్ ) జూన్ 21**



రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన ఎరువుల డిజిటల్ విధానం క్షేత్రస్థాయిలో తీవ్ర గందరగోళానికి దారితీస్తోందని, సామాన్య రైతుల పాలిట శాపంగా మారిన 'యూరియా యాప్'ను తక్షణమే రద్దు చేయాలని మసాయిపేట బీఆర్ఎస్ మాజీ సర్పంచ్ చిట్టిమాల నాగరాజు డిమాండ్ చేశారు. శనివారం మసాయిపేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.సాంకేతికతను జోడిస్తున్నామనే సాకుతో కాంగ్రెస్ ప్రభుత్వం అన్నదాతలను తీవ్ర మానసిక వేదనకు గురిచేస్తోందని ఆయన మండిపడ్డారు. ఈ సందర్భంగా చిట్టి మిల్ల నాగరాజు మాట్లాడుతూ తెలంగాణ గ్రామాల్లో అత్యధిక శాతం మంది చిన్న, సన్నకారు రైతులే ఉన్నారని గుర్తుచేశారు.వీరికి స్మార్ట్‌ఫోన్ల వాడకం కానీ, ప్రభుత్వాలు ప్రవేశపెట్టే యాప్‌లలో రిజిస్ట్రేషన్ల ప్రక్రియపై కానీ కనీస అవగాహన లేదన్నారు. ఎలాంటి ముందస్తు ప్రణాళికలు లేకుండా, రైతులకు సరైన శిక్షణ ఇవ్వకుండా ఇలాంటి యాప్ విధానాలను బలవంతంగా రుద్దడం దుర్మార్గమని ధ్వజమెత్తారు.

**రైతు పక్షాన పోరాటానికి సిద్ధం:**

ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం మొండివైఖరి వీడాలని, తక్షణమే ఈ సంక్లిష్టమైన యాప్ విధానాన్ని రద్దు చేసి పాత పద్ధతిలోనే ఎరువుల పంపిణీ చేపట్టాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతుల పక్షాన బీఆర్ఎస్ పార్టీ పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతుందని చిట్టి మిల్ల నాగరాజు హెచ్చరించారు.

# విత్తన మేళాకు ఆహ్వానం పలికిన కురవి రైతు వేదిక...

- విత్తనాలు పంపిణీ కార్యక్రమం ను ప్రారంభించనున్న కురవి అగ్రికల్చర్ ఆఫీసర్ జి.నరసింహా రావు...

**కురవి జూన్ 21 (ప్రజా తీర్పు విలేఖరి)**

కురవి మండలంలోని రైతులందరికీ,రైతులకు నాణ్యమైన విత్తనాలు, పప్పు ధాన్యాల విత్తనాలు మరియు ఆధునిక ఎరువుల వినియోగంపై అవగాహన కల్పించుటకు విత్తన మేళా (సీడ్స్ మేళా) ను మంగళవారం నుండి నిర్వహించబడుచున్నది.ఈ విత్తన మేళాలో వరి రకాల విత్తనాలు ప్రభుత్వం బోనస్ అమలు చేసేవి అందుబాటులో ఉంటాయి.ఇందులో ఉన్న బిపిటి 5204, హెచ్ ఎం టి సోనా,జై శ్రీరామ్,కెఎన్ఎం1638, ఆర్ ఎన్ ఆర్ 15048, వరంగల్ 44,కెఎన్ఎం7715, వాటిని వేసుకోవాలని సూచించారు.అదేవిధంగా వివిధ పప్పుధాన్యాల,అపరాలు,కూరగాయలు విత్తనాలు,నానో యూరియా,నానో డీఏపీ తదితర వ్యవసాయ ఉత్పత్తులు కూడా రైతులకు అందుబాటులో ఉంటాయి.ప్రజా ప్రతినిధులు మరియు వ్యవసాయ శాఖ అధికారుల సమక్షంలో ఈ కార్యక్రమం నిర్వహించబడును.కావున ప్రతి రైతు సోదరులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని విత్తన మేళాకు హాజరై అవసరమైన విత్తనాలు మరియు వ్యవసాయ ఉత్పత్తులను పొందగలరని కురవి మండల వ్యవసాయ అధికారి తెలిపారు.

# మంచిర్యాల : తెలంగాణ ఉద్యమ కారుల ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఆచార్య జయశంకర్ సార్ 15 వ, వర్ధంతి.

**(అరికిల్ల జయకుమార్, ప్రజా తీర్పు, మంచిర్యాల మండల్)జూన్ 21**



మంచిర్యాల జిల్లా కేంద్రంలో తెలంగాణ ఉద్యమ కారుల ఐక్య వేదిక, సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం మరియు బీసీ సంఘాల ఆధ్వర్యంలో తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం తన జీవితాన్నే అంకితం చేసిన తెలంగాణ జాతి పిత ఆచార్య కొత్తపల్లి జయశంకర్ సార్ గారి 15 వ, వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. జయశంకర్ సార్ చిత్రపటానికి పలువురు ఉద్యమ నాయకులు పూలమాలలు వేసి వినమ్రంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమ కారుల ఐక్య వేదిక , సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు, బీసీ సంఘాల నాయకుడు గజెల్లి వెంకటయ్య మాట్లాడుతూ 1200 మంది విద్యార్థిని విద్యార్థుల ఆత్మ బలి దానల పునాదుల పైన ఏర్పడ్డ తెలంగాణ రాష్ట్రం , కేవలం బహుగోళిక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైనదని సామాజిక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం మరో ఉద్యమం చేయాల్సిన అవసరం ఉందని , ఉద్యమాల ద్వారా అమర వీరుల ఆత్మ బలిదానాల సాక్షిగా ఏర్పడ్డ తెలంగాణ రాష్ట్రం లో మెజారిటీ ప్రజలు అయినా బీసీ , ఎస్సీ, ఎస్టీ మరియు మైనారిటీ లకు ఈ తెలంగాణ రాష్ట్రం లో రాజ్యాధికారం అందని ద్రాక్షగానే మిగిలి పోయినదని కొత్తగ ఏర్పడ్డ రాష్ట్రం లో అతి తక్కువ జనాభా కలిగిన రావు లు , రెడ్డి ల రాజ్యాధికారమే గత పన్నెండున్నర సంవత్సరాల నుండి ఏలుబడి లో ఉన్నదని , ఇప్పటికీ తెలంగాణ రాష్ట్రం లో సీమాంధ్ర పెట్టుబడి దారుల రాజకీయ ఆధిపత్యమే కొనసాగుతున్నట్లు ఈ మధ్యలో జరిగిన కొన్ని సంఘటనలే ఉదాహరణ అని పేర్కొన్నారు . తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు చేసుకున్నదే ఆత్మ గౌరవం కోసం , తెలంగాణ ప్రజల అస్తిత్వం కోసం తెలంగాణ ప్రజల సాహిత్య , సంప్రదాయాలు పరిరక్షణ కోసం అని కానీ ఇప్పటికీ సీమాంధ్ర రాజకీయ నాయకులు తెలంగాణ లోని ఉద్యమ కారుల , మేధావుల , ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియా మరియు ప్రజల పై వారి ఆధిపత్యాన్ని కొనసాగిస్తూ , తెలంగాణ ప్రజల ఆత్మ గౌరవాన్ని దెబ్బ తీసే విధంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అందుకే తెలంగాణ లోని మెజారిటీ ప్రజలైన బీసీ , ఎస్సీ, ఎస్టీ ల మైనారిటీ లకు రాజ్యాధికారం దక్కే విధంగా మరో ఉద్యమం చేసి అమర వీరుల ఆశయాన్ని సాధించుకోవాలని అన్నారు. 2023 ఎన్నికల కన్నా ముందు తెలంగాణ ప్రజలకు కాంగ్రెస్ పార్టీ చేసిన వాగ్దానాలను వెంటనే అమలు చేయాలని , నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్ ప్రకటించి ఉద్యోగాలకు నోటిఫికేషన్లు వేసి , ప్రతి సంవత్సరానికి 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని చేసిన వాగ్దానాన్ని కాంగ్రెస్ పార్టీ నిలుపుకోవాలని కోరినారు . తెలంగాణ ఉద్యమ కారులకు 250 గజాల ఇంటి స్థలం, 50,000 పెన్షన్ , ఉచిత రవాణా సౌకర్యాలు , ఉద్యమ కారులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని ఈ సందర్భంగా డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు గజెల్లి వెంకటయ్య, గౌరవ అధ్యక్షులు రాళ్లబండి రాజన్న , ప్రధాన కార్యదర్శి పుదారి నర్సయ్య, నాయకులు సత్యనారాయణ , రాంరెడ్డి , రాజేశం , చందు , లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.. ఈ సందర్భంగా జై తెలంగాణ అంటూ జోహార్లు తెలంగాణ అమర వీరులకు జోహార్లు అంటూ పోరాడుదాం సామాజిక తెలంగాణ రాష్ట్రం కోసం తెలంగాణ ఉద్యమ కారులారా ఏకం కండి అంటూ నినాదాలు చేశారు.



## వాలేగాం గ్రామంలో గ్రామదేవతల పండుగ ఘనంగా వేడుకలు

**(కపిల్ వాగ్మారే సీఆర్ కే, ప్రజా తీర్పు భైంసా) జూన్ 21**

నిర్మల్ జిల్లా భైంసా మండలంలోని వాలేగాం గ్రామంలో ఆదివారం గ్రామదేవతలైన లక్ష్మి, పోచమ్మల పండుగను గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. మహిళలు అమ్మవార్లకు ప్రత్యేక బోనాలు సమర్పించి, నైవేద్యాలు అర్పించి పూజలు చేశారు.గ్రామ ప్రజలు అమ్మవారి గుడి చుట్టూ ప్రదర్శనలు నిర్వహించి, అమ్మవారిని ఆరాధించారు. ఈ సందర్భంగా డప్పులు, చెప్పుల వాయిద్యాలతో అమ్మవారి గంగానీళ్లు, బోనాల ఊరేగింపు ఘనంగా జరిగింది. ఈ ఊరేగింపులో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.అమ్మవారిని పూజించిన అనంతరం, గ్రామస్తులు వానలు సభివృద్ధిగా కురవాలని, పాడిపంటలు చల్లగా ఉండాలని ఆకాంక్షించారు.ఈ పండుగ గ్రామస్తుల మధ్య ఐక్యతను, భక్తిభావాన్ని,పెంపొందించిందిసాంప్రదాయబద్ధంగా జరిగిన ఈ వేడుకలు గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పాయి. గ్రామ దేవతల ఆశీస్సులతో గ్రామం సుభిక్షంగా ఉండాలని ప్రజలు కోరుకున్నారు.



## ఎస్ ఆర్ ఆర్ డయాగ్నొస్టిక్ సెంటర్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్

**(కపిల్ వాగ్మారే సీఆర్ కే,ప్రజా తీర్పు భైంసా) జూన్ 21**

నిర్మల్ జిల్లా భైంసా పట్టణం లోని ఎస్ ఆర్ ఆర్ డయాగ్నొస్టిక్ సెంటర్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్,భైంసాపట్టణంలోనూతనంగా ఏర్పాటు చేసిన ఎస్ఆర్ఆర్ డయాగ్నొస్టిక్ సెంటర్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ పాల్గొన్నారు.ఆయన సెంటర్‌ను ప్రారంభించి,అందులోని వివిధ విభాగాలను సందర్శించి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ,భైంసా పట్టణంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన వైద్య, నిర్ధారణ కేంద్రాలు అందుబాటులోకి రావడం ప్రజలకు ఎంతో ఉపయోగకరమని,ఇది ప్రాంతఅభివృద్ధికి,శుభసూచకమనిపేర్కొన్నారు.ఈకార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్‌తో తూమొళ్ళ దత్తు,మరియు డాక్టర్ అజయ్ రెడ్డి,డాక్టర్ కైలాష్ డాక్టర్ వనజ,డాక్టర్ ముత్యంరెడ్డి,తోపాటు పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు మరియు స్థానిక ప్రముఖులు తదితరులు పాలుగోన్నారు.

## ఫాదర్స్ డే రోజున మోదీకి ప్రత్యేక శుభాకాంక్షలు' తెలిపిన ఎంపీ వంశీకృష్ణ

**(వి వెంకటేష్ ప్రజా తీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) జూన్ 21**



ఫాదర్స్ డే సందర్భంగా పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడు గడ్డం వంశీకృష్ణ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పై వ్యంగ్య వ్యాఖ్యలు చేశారు. సోషల్ మీడియా వేదికగా స్పందించిన ఆయన, కేంద్ర ప్రభుత్వం గత పదేళ్లలో ఇచ్చిన హామీలు, తీసుకున్న నిర్ణయాలు మరియు వాటి ప్రభావాలను ప్రస్తావిస్తూ ప్రధాని మోదీకి ప్రత్యేక ఫాదర్స్ డే శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీమోనిటైజేషన్ ఫాదర్ డ్రామా–బాజ్ పాలిటిక్స్ ఫాదర్, మెలోడీ డిప్లొమసీ ఫాదర్,రూపాయి డివాల్యుయేషన్ ఫాదర్, ప్రతి సంవత్సరం 2 కోట్ల ఉద్యోగాల హామీ ఫాదర్, నల్లధనం ఫాదర్, నీట్ పేపర్ లీకులు మరియు స్కామ్‌ల ఫాదర్, రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామన్న హామీ ఫాదర్, ప్రతి ఖాతాలో రూ.15 లక్షలు జమ చేస్తామన్న హామీ ఫాదర్, అచ్చే దిన్ ఫాదర్" అంటూ విమర్శనాత్మక వ్యాఖ్యలు చేశారు.దేశ యువత, నిరుద్యోగులు, రైతులు మరియు సామాన్య ప్రజలు నేడు అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నారని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుపై ప్రజలు సమాధానాలు కోరుతున్నారని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో విఫలమైందని ఆరోపించారు. ప్రజాస్వామ్యంలో ప్రజలకు జవాబుదారీతనం అత్యంత ముఖ్యమని, ఎన్నికల హామీలు కేవలం ప్రచార నినాదాలుగానే మిగలకూడదని ఎంపీ వంశీకృష్ణ అన్నారు. ప్రజల జీవితాలను ప్రభావితం చేసే అంశాలపై కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన సమాధానాలు ఇవ్వాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. చివరగా యే హై ఆజ్ కా భారత్. హ్యాపీ ఫాదర్స్ డే నరేంద్ర మోదీ జీ. జై హింద్ జై భారత్ అంటూ తన సందేశాన్ని ముగించారు.

## లోక్ ఆదాలత్ నందు 5108 కేసులు పరిష్కారం.

- సైబర్ నేరాలకు సంభందించి 75 కేసుల్లో 27.78 లక్షల నగదు బాధితుల ఖాతాలో జమ
- జిల్లా ఎస్పి కె.నరసింహ ఐపిఎస్,

**(అనంతుల శ్రీనివాస్ గౌడ్,ప్రజా తీర్పు సూర్యాపేట జిల్లా ప్రతినిధి) జూన్ 21**

ఈరోజు జిల్లా వ్యాప్తంగా శనివారం రోజున నిర్వహించిన జాతీయ మెగా లోక్ అదాలత్ నందు న్యాయశాఖతో సమన్వయంగా పని చేసి సూర్యాపేట జిల్లా పోలీస్ పెండింగ్ లో ఉన్న కేసుల్లో 5018 కేసులను పరిష్కరించడం జరిగిందని సైబర్ మోసాలకు సంబంధించి 75 కేసుల్లో 27 లక్షల 78 వేల రూపాయలను బాధితుల ఖాతాలో జమ చేయడం జరిగింది అని జిల్లా ఎస్పీ నరసింహ ఐపిఎస్ గారు ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో 1298 క్రిమినల్ కేసులు, 1907 ఈ-పెట్టీ కేసులు, 1903 యం.వి యాక్ట్, డ్రంకన్ డ్రైవ్ కేసులు పరిష్కరించడం జరిగినది అన్నారు. పోలీస్ శాఖ కోర్టులతో సమన్వయంగా పటిష్టంగా పనిచేయడం వల్ల ఈ కేసులు పరిష్కరించడం సాధ్యమైందని తెలిపారు. దీనికోసం ప్రణాళికతో పనిచేసి పరిష్కరించదగిన కేసులను ముందుగానే గుర్తించాం అన్నారు. అదనపు ఎస్పి రవీందర్ రెడ్డి, జిల్లా క్రైమ్ రికార్డ్ బ్యూరో సిబ్బంది ఎప్పటికప్పుడు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షణ చేశారు. ఈ క్రమంలో బాగా పనిచేసిన జిల్లా పోలీస్ శాఖ సిబ్బందిని అభినందిస్తున్నాను అని తెలిపారు.

# సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో ఎస్సీ బుద్ధిష్ట్ వివరాలు చెప్పని కాంగ్రెస్ ప్రభుత్వం

- బుద్ధ విహార్ వద్ద పత్రిక సమావేశంలో మాట్లాడిన ఘుడ్పాలే ప్రభాకర్

**(కపిల్ వాగ్మారే సీఆర్ కే,ప్రజా తీర్పు భైంసా) జూన్ 21**



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 2024లో రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహించింది. ఈ సర్వే ద్వారా కుటుంబాల సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, ఉద్యోగ, రాజకీయ మరియు కుల సంబంధిత వివరాలుసేకరించింది.ఇంటింటికీ వెళ్లి 242 కులాలను గుర్తించి కుటుంబ సభ్యుల వివరాలను నమోదు చేసింది.బీసీ 134 కులాలు,ఎస్సీ 59 కులాలు,ఎస్టీ 32 కులాలు,ఓసీ18 కులాలు జనాభా వివరాల అధికారికంగా విడుదల చేసిన విషయంతెలిసిందే.తెలంగాణ రాష్ట్రంలో ఎస్సీ బౌద్ధుల(బుద్ధిస్టులు) ఎంత మంది ఉన్నారు అనేదే వివరాలు అధికారికంగా ప్రకటించలేదని ఉత్తర తెలంగాణ రాష్ట్ర భారతీయ బౌద్ధ మహాసభ అధ్యక్షుడు ఘుడ్పాలే ప్రభాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు ఆదివారం భైంసా పట్టణం బుద్ధ విహార్ వద్ద మీడియా సమావేశం ఏర్పాటు ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ ఎస్సీ బౌద్ధుల(బుద్ధిస్టులు) వివరాలు దాచిపెట్టి ఎస్సీ బౌద్ధుల(బుద్ధిస్టులు)ప్రజలకు సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే లో అన్యాయం జరిగిందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ బౌద్ధుల(బుద్ధిస్టులు వివరాలు అధికారికంగా ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వానికి కోరారు. ఎస్సీ బౌద్ధుల(బుద్ధిస్టులు) వివరాలు అధికారికంగా బయటకు పెట్టుకుంటే మండల స్థాయి నుంచి జిల్లా రాష్ట్ర స్థాయి వరకు ఆందోళన చేయడానికి సిద్ధంగా ఉన్నామని వారు హెచ్చరించారు.ఈ సమావేశంలో ఉత్తర తెలంగాణ రాష్ట్ర సమత సైనిక్ దళ్ ఉపాధ్యక్షుడు నారాయణ వాగ్మారే, బుద్ధ అంబేద్కర్ ఐడల్ ప్రొటెక్షన్ కమిటీ అధ్యక్షుడు న్యాయవాది దేవిదాస్ హస్నే. ట్రెజరర్ రాజారాం దాసరి. భారతీయ బౌద్ధ మహాసభ నిర్మల్ శాఖ ట్రెజరీ రాంచందర్ జంగ్మే. నారాయణ జంగ్మే. జైపాల్ కస్తూరే.పాల్గొన్నారు.



## నల్ల పోచమ్మ తల్లి పండుగను ఘనంగా నిర్వహించిన శాలివాహన కుమ్మరి యువసేన

**కోరుట్ల జూన్ 21 (ప్రజాతీర్పు)**

కోరుట్ల మండలంలోని మోహన్‌రావుపేటలో నల్ల పోచమ్మ తల్లి పండుగను శాలివాహన కుమ్మరి యువసేన ఆధ్వర్యంలో ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఈ వేడుకల్లో యువసేన సభ్యులు, స్థానిక భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో శాలివాహన కుమ్మరి యువసేన అధ్యక్షుడు మారుపాక రాజేష్, క్యాషియర్ శనిగారపు అనుదీప్, కార్యవర్గ సభ్యులు ధుంపేట విజయ్, మామిడిపల్లి నాగరాజ్, శనిగారపు మధు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం సభ్యులు మారుపాక పరమేశ్, అగనూరి తిరుపతి, మామిడిపల్లి గంగాధర్, మామిడిపల్లి రామకృష్ణ, మారుపాక మహేష్, మారుపాక రంజిత్, కేలేటి వంశీ, సంగెపు శ్రీకర్, మామిడిపల్లి కళ్యాణ్, మామిడిపల్లి రవి, మామిడిపల్లి రాజ బూమయ్య తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా యువసేన ప్రతినిధులు మాట్లాడుతూ, సంప్రదాయాలను పరిరక్షిస్తూ ప్రతి సంవత్సరం నల్ల పోచమ్మ తల్లి పండుగను ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమం విజయవంతానికి సహకరించిన సభ్యులు, భక్తులు మరియు స్థానిక ప్రజలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.




## 47 వ ఉచిత వైద్య శిబిరాన్ని సందర్శించినతెలంగాణ స్టేట్ ప్రోటోకాల్ మరియు కో ఆర్డినేషన్ వైస్ చైర్మన్ బొంగునూరి కిషోర్ రెడ్డి

**కుత్బుల్లాపూర్, జూన్ :- 21(ప్రజా తీర్పు )**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని దుల్లపల్లి సొసైటీ బ్యాంక్ వికార్ సెక్షన్ కాలనీ, జిల్లా పరత్ స్కూల్ దగ్గర, నిర్వహించిన 47 వ ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కిషోర్ రెడ్డి మాట్లాడుతూ, దుల్లపల్లి సొసైటీ బ్యాంక్ వికార్ సెక్షన్ కాలనీ వాసులు ఈ ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని మీడియా సమావేశంలో తెలిపారు. ఈ కార్య క్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పి ఎ సి ఎస్ చైర్మన్ నరేందర్ రాజు , మాజీ ఎంపీటీసీ మల్లేష్, మాజీ కౌన్సలర్ శివకుమార్ గౌడ్, భాస్కర్ గౌడ్, బోగారం వెంకటేష్, ఐలేష్ యాదవ్, డప్పు నరేందర్, సాధు యాదవ్, శివారెడ్డి, సొసైటీ బ్యాంక్ వికార్ సెక్షన్ కాలనీ వాసులు మరియు టీమ్ బికెఆర్ సభ్యులు పాల్గొన్నారు.



## మంచిర్యాల : నీట్ పరీక్ష కేంద్రాలను సందర్శించిన పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ జా.

**(అరికిల్ల జయకుమార్ ప్రజా తీర్పు మంచిర్యాల మండల్) జూన్ 21,**

మంచిర్యాలలో ఆదివారం నిర్వహించిన నీట్ పరీక్ష సందర్భంగా రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా,డీసీపీ ఎ. భాస్కర్ తో కలిసి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా పరీక్షా కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన పోలీసు బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించిన సీపీ, పరీక్షకు హాజరైన అభ్యర్థుల సంఖ్య, భద్రతా ఏర్పాట్ల గురించి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే,పరీక్షలు ముగిసిన అనంతరం పరీక్షా సామగ్రిని సురక్షితంగా తరలించే విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, మంచిర్యాల పట్టణంలో మొత్తం ఐదు పరీక్షా కేంద్రాల్లో నీట్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు.పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా ట్రాఫిక్ నిర్వహణతో పాటు పటిష్ఠమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పరీక్షలు ముగిసిన అనంతరం జవాబు పత్రాలు,ఇతర పరీక్షా సామగ్రిని సురక్షితంగా గమ్యస్థానాలకు తరలించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.ప్రస్తుతం అన్ని పరీక్షా కేంద్రాల్లో ప్రశాంత వాతావరణం నెలకొని ఉందని, విద్యార్థులు ఎలాంటి ఆందోళన చెందకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని కోరారు.

## ఆచార్య జయశంకర్‌కు నివాళులు అర్పించిన దుద్దిళ్ల శ్రీను బాబు

**మంథని, జూన్-21 (ప్రజాతీర్పు)**



మంథని పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ ఆచార్య జయశంకర్ వర్ధంతి కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీను బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆచార్య జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఆచార్య జయశంకర్ చేసిన త్యాగాలు, ఉద్యమ స్ఫూర్తి, సమాజానికి అందించిన సేవలను స్మరించుకున్నారు. తెలంగాణ ప్రజల హక్కుల కోసం జీవితాంతం పోరాడిన ఆచార్య జయశంకర్ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.



## జగిత్యాల జిల్లా ఎండోమెంట్ సెల్ కన్వీనర్‌గా మాడవేణి నరేష్ నియామకం

**కోరుట్ల జూన్ 21 (ప్రజాతీర్పు)**

భారతీయ జనతా పార్టీ జగిత్యాల జిల్లా ఎండోమెంట్ (ధార్మిక) సెల్ కన్వీనర్‌గా మాడవేణి నరేష్‌ను నియమిస్తూ నియామక పత్రాన్ని జిల్లా బీజేపీ అధ్యక్షుడు రాచకొండ యాదగిరి బాబు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అనూప్ రావు, కోరుట్ల పట్టణ అధ్యక్షుడు కస్తూరి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, కోరుట్ల పట్టణంలో గో సంరక్షణ, దేవాలయాల పరిరక్షణ, హిందూ ధర్మం మరియు హిందూ ఐక్యత కోసం మాడవేణి నరేష్ నిరంతరం కృషి చేస్తున్నారని కొనియాడారు. గోవుల సంరక్షణ అంశంలో ఎన్నో ఇబ్బందులు, కేసులు ఎదురైనా వెనుకడుగు వేయకుండా ధర్మం కోసం పనిచేస్తున్న నరేష్‌కు ఈ బాధ్యతలు అప్పగించడం అభినందనీయమని పేర్కొన్నారు.నియామక పత్రం అందుకున్న మాడవేణి నరేష్ మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన ఇందూరు పార్లమెంట్ సభ్యుడు ధర్మపురి అరవింద్, జిల్లా అధ్యక్షుడు రాచకొండ యాదగిరి బాబు, రాష్ట్ర నాయకుడు అనూప్ రావు, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఎండోమెంట్ సెల్ ఇన్‌చార్జ్ బోగ రవి, పట్టణ అధ్యక్షుడు కస్తూరి లక్ష్మీనారాయణతో పాటు పార్టీ కుటుంబ సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ మరింత ఉత్సాహంతో పనిచేస్తానని చెప్పారు.ఈ కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శులు ఎర్ర రాజేందర్, చెట్లపెల్లి సాగర్, మ్యకల గణేష్, గందె నవీన్, సీనియర్ నాయకులు పోతుగంటి శ్రీనివాస్, ఎల్లల నారాయణరెడ్డి, ఎంఎస్ అక్మల్, తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, నెమురి విజయ్, గడ్డం రాజశేఖర్, కచ్చు రమేష్, బాల్క ప్రేమ్ సాగర్, తైదాల ప్రశాంత్, సంకు రమేష్ తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు జన్మదిన వేడుకలు

**కోరుట్ల, జూన్ 21 (ప్రజాతీర్పు)**

కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకుడు జువ్వాడి కృష్ణారావు జన్మదిన వేడుకలు ఆదివారం కోరుట్ల పట్టణంలోని ఆయన స్వగృహం "జువ్వాడి భవన్"లో ఘనంగా నిర్వహించారు. పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తిరుమల గంగాధర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ తిరుమల వసంత గంగాధర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి జువ్వాడి కృష్ణారావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి 25 కిలోల బియ్యాన్ని దానం చేశారు. అలాగే నివేదిత ఆశ్రమాన్ని సందర్శించి అక్కడి వృద్ధులకు పండ్లు పంపిణీ చేయడంతో పాటు మరో 25 కిలోల బియ్యాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ తిరుమల వసంత గంగాధర్ మాట్లాడుతూ జువ్వాడి కృష్ణారావు ప్రజాసేవలో మరింత ముందుకు సాగాలని, ఇలాంటి జన్మదిన వేడుకలను మరెన్నో జరుపుకోవాలని, భవిష్యత్తులో ఉన్నత పదవులను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు కొంతం రాజం, కౌన్సిలర్ చిట్యాల లక్ష్మీనారాయణ, తోట గంగాధర్, రియాజ్, మున్సిపల్ స్టాండింగ్ కమిటీ సభ్యుడు కస్తూరి రమేష్, నాయకులు నేమూరి భూమయ్య, ఏడ్ల రమేష్, ఎతిరాజం నర్సయ్య, నేతి శ్రీకాంత్, శేఖర్ రెడ్డి, చిట్మెల్లి రంజిత్ గుప్తా, నజ్జు కిరణ్, సంఘలింగం శ్రీరాములు, అమరేందర్‌తో పాటు కాంగ్రెస్ పార్టీకి చెందిన వివిధ హోదాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## యోగతో మానసిక ఒత్తిడి దూరం.. సామర్థ్యంతో విధులు... - ఎస్పీ

**(అనంతుల శ్రీనివాస్ గౌడ్,ప్రజా తీర్పు సూర్యాపేట జిల్లా ప్రతినిధి) జూన్ 21**



అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈరోజు సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ అధికారులకు, సిబ్బందికి ప్రత్యేక యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం కోసం ప్రతి ఒక్కరూ యోగాను నిత్య జీవితంలో భాగం చేసుకోవాలనే సంకల్పంతో ఈ కార్యక్రమం సాగింది. ఈ యోగా కార్యక్రమంలో జిల్లా ఎస్పీ నర్సింహా ఐపీఎస్ గారు స్వయంగా పాల్గొని, పోలీస్ సిబ్బందితో కలిసి వివిధ రకాల ఆసనాలు, ప్రాణాయామం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ గారు మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణలో నిరంతరం ఒత్తిడితో కూడిన విధులు నిర్వహించే పోలీస్ సిబ్బందికి యోగా ఎంతో మేలు చేస్తుందని పేర్కొన్నారు. యోగా ద్వారా మానసిక ప్రశాంతత లభించడమే కాకుండా, వృత్తిపరమైన బాధ్యతలను మరింత సమర్థవంతంగా నిర్వహించడానికి అవసరమైన శక్తి లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ గారితో పాటు అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి, డీఎస్పీలు ప్రసన్నకుమార్, నరసింహ చారి, సీఐలు వెంకటయ్య, రాజశేఖర్, ఆర్ఐలు ప్రవీణ్, జానయ్య, ఎస్ఐ లు, ఆర్ఎస్ఐ లు మరియు పోలీస్ సిబ్బంది పాల్గొని యోగాసనాలు వేశారు.



## సామాజిక సమరసత సాధించడం సద్భావన ఉద్దేశం

**(వెగ్గళం రాధాకిషన్ ప్రజాతీర్పు ఇల్లంతకుంట )జూన్ 21**

మండల కేంద్రంలోని జలపతి రెడ్డి ఫంక్షన్ హాల్ లో సామాజిక సద్భావన ఖండ సంయోజక్ అయ్యన్న గారి హరికృష్ణ రెడ్డి ఆధ్వర్యంలో సామాజిక సమరసత సదస్సు లో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ కరి నగర్ జిల్లా సహ సంఘ్ చాలక్ ఎలగందుల సత్యనారాయణ పాల్గొన్నారు.ఇల్లంతకుంట మండలంలోని 10 గ్రామాల నుండి కుల సంఘాల పెద్దలు పాల్గొన్నారు అని హరికృష్ణ రెడ్డి తెలియజేశారు. ఈ సందర్భంగా ఎలగందుల సత్యనారాయణ మాట్లాడుతూ సమాజంలో సామాజిక పరివర్తన రావాలి అంటే సామాజిక దృక్పథం గల కుల సంఘాల పెద్దలు ప్రజల దగ్గరికి వెళ్లి మార్పు తీసుకురావాలని కోరారు. సమాజంలోని ప్రజలందరూ పంచ పరివర్తనను పాటించే విధంగా అలవాటు చేయాలని పిలుపునిచ్చారు.కులాలకు అతీతంగా దేవాలయాల్లో అందరికీ ప్రవేశం ఉండే విధంగా చూడాలని కోరారు. రాబోయే రోజుల్లో పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత మన అందరి పైన బాధ్యత ఉందన్నారు. రాజ్యాంగ చట్టాలను ప్రతి ఒక్కరూ పాటించాలని తెలిపారు.స్వదేశీ వస్తువులను ఉపయోగించడం వల్ల దేశం యొక్క ఆర్థిక స్థితి మెరుగుపడుతుందని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కరినగర్ జిల్లా పర్యావరణ ప్రముక్ బత్తిని ఆంజనేయులు, ఇల్లంతకుంట ఖండ కార్యవాహ తాటిపల్లి మహేష్, సహ కార్యవాహ కాసుపాక కిషన్, వ్యవస్థ ప్రముక్ బొల్లం ధనుంజయ్, బౌద్ధిక్ ప్రముక్ నాగ సముద్రాల బాలకృష్ణ, వివిధ గ్రామాల సామాజిక సద్భావన సభ్యులు తదితరులు పాల్గొన్నారు

# జెఈఈ అడ్వాన్స్‌డ్‌లో ఆల్ ఇండియా 450వ ర్యాంక్ సాధించిన బందెల కౌశిక్‌కు ఘన సన్మానం

**మంథని, జూన్-21 (ప్రజాతీర్పు)**



మంథని మండలం బట్టుపల్లి గ్రామానికి చెందిన బందెల పద్మ-లక్ష్మణ్ దంపతుల ద్వితీయ పుత్రుడు బందెల కౌశిక్ జెఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షలో ఆల్ ఇండియా 450వ ర్యాంక్ సాధించి, ఐఐటీ బొంబాయిలో సీటు పొందిన సందర్భంగా గ్రామంలో ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు.

శుక్రవారం మాజీ సర్పంచ్ బందెల లక్ష్మణ్, ప్రస్తుత సర్పంచ్ స్వరూప రవి, ఉప సర్పంచ్ బందెల కిష్టయ్య ఆధ్వర్యంలో కౌశిక్‌తో పాటు అతని తల్లిదండ్రులను శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కౌశిక్ సాధించిన విజయం బట్టుపల్లి గ్రామానికి గర్వకారణమని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన విద్యార్థి కష్టపడి చదివి జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరచడం అభినందనీయమని అన్నారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించి గ్రామానికి, రాష్ట్రానికి మరింత పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కొలకాని సమ్మయ్య, భూగొండ రవి మాట్లాడుతూ, కౌశిక్‌ను ఆదర్శంగా తీసుకుని గ్రామంలోని విద్యార్థులు కూడా ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు కృషి చేయాలని సూచించారు. తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల (బాలురు) మంథనిలో విద్యాభ్యాసం చేసిన కౌశిక్ ఐఐటీ వరకు ఎదగడం ఇతర విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని అన్నారు. కార్యక్రమంలో కొలకాని సమ్మయ్య, మేకల కిట్టు, మేకల మధునయ్య, మేడగాని సంతు, గోట్టం లక్ష్మీనారాయణ, రాజు, కొలకాని భూమయ్య, కొలకాని రమేష్, గడ్డి కుమార్, అప్పాల కుమార్, దుగ్నే సతీష్, తాటి రాకేష్, బందెల మధు, సెనవేణి సునీల్, విక్కి మల్లేష్, శివయ్య, బందెల సమ్మయ్య, బందెల శారద-లక్ష్మణ్, మేకల విజయ-మధునయ్య, బందెల శిరీష-కిట్టు, అభిజ్ఞ, భవిజ్ఞ, నరేందర్. ఎం తదితరులు పాల్గొన్నారు.

# మాసాయిపేట మండల కేంద్రంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం

యోగ ఫర్ హెల్త్ ఏజ్ గైనింగ్ కార్యక్రమం.

**( వంజరపు ఎల్లం ప్రజా తీర్పు ప్రతినిధి మాసాయిపేట్) జూన్ 21**



మెదక్ జిల్లా మాసాయిపేట మండల కేంద్రంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు ఈ సందర్భంగా విద్యార్థులు, గ్రామ యువకులకు యోగా టీచర్స్ కరణం శ్రీదేవి, మహేష్ యోగాసనాలతో చెప్పి వారికి యోగ పై అవగాహన కల్పించి యొక్క ప్రయోజనాలను తెలియజేశారు . యోగాలో పాల్గొన్న వక్తలు మాట్లాడుతూ యోగా ఒక ఆయుర్వేదిక్ మెడిసిన్ అని ఈ ఆధునిక యోగంలో రసాయన ఎరువులతో పండిన పంటలను తినుకుంటూ మన పూర్వకాలం పెద్దవాళ్లు చేసే పనులన్నీ యోగాలో ఒక భాగం అని ఇప్పుడు పూర్తిగా అంతరించిపోవడంతో యంత్రాలపై ఆధారపడవలసి వస్తుందని తద్వారా మనకు షుగర్, బీపీ ఉబకాయం, హార్ట్ ఎటాక్ లాంటి జబ్బులు మన శరీరాన్ని పీల్చి పిప్పి చేస్తున్నాయని శరీరక శ్రమ లేకపోవడం కృత్రిమ ఎరువులను వాడకపోవడం వల్ల తొందరగా మన శరీరం అలసిపోవడం, అనారోగ్య పాలు కావడం జరుగుతుందని ఇప్పుడు ఈ యోగ ద్వారా మన శరీరాన్ని ఆయుర్వేదిక పద్ధతి ద్వారా న్యాచురల్ గా బలిష్టంగా చేసుకోవడానికి ఉపయోగపడుతుందని గత 12 సంవత్సరాల నుండి యోగ దినోత్సవం జరుపుకుంటున్నామని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఇప్పుడు పిల్లల్లో మానసిక ధైర్యం కోల్పోతున్నారని యోగా చేయడం వల్ల మానసిక ప్రశాంతత మరియు శరీరక కండరాలకు కు మంచి ఉపశమనం లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కృష్ణారెడ్డి, ఎంఈఓ మధుసూదన్ రావు, ఉప సర్పంచ్ వెంకటేశం, మాజీ ఎంపీటీసీ సిద్ధిరాములు గౌడ్, వార్డు సభ్యులు, విద్యార్థిని విద్యార్థులు, గ్రామ యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# విద్య వ్యాపారం కాదు, మన ప్రాథమిక హక్కు

- అంబేద్కర్ ఆశయ సాధన సంఘం సభ్యులు.

**బోడుప్పల్ / జూన్ 21 ( ప్రజాతీర్పు )**



మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్లో అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నత్తి మైసయ్య ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి 383వ ఆదివారం జ్ఞానమాల సమర్పించి భారత రాజ్యాంగ నిర్మాణం కోసం ఆయన చేసిన సేవలను, త్యాగాలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా అంబేద్కర్ ఆశయ సాధన సంఘం సభ్యులు మాట్లాడుతూ ప్రభుత్వాలు విద్యారంగం నిర్లక్ష్యం చేయడంతో కార్పొరేట్ సంస్థలు విద్యారంగంలోకి ప్రవేశించి విద్యను వ్యాపారంగా మార్చాయని, తమ పిల్లలకు లక్షలాది రూపాయల ఫీజులు చెల్లించలేక పేద, మధ్య తరగతి తల్లిదండ్రులు ఆర్థికంగా చితికి పోతున్నారని, ప్రభుత్వాలు అధిక నిధులు విద్యారంగానికి కేటాయించి అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన మౌలిక వసతులు, సరిపడ ఉపాధ్యాయులు, కల్పించినట్లయితే బడుగు బలహీన వర్గాలు విద్యావంతులై ఉన్నత శిఖరాలకు ఎదుగుతారని, ప్రతి ఒక్కరూ చదువుకోడానికి సుముఖత చూపుతారని అన్నారు. అంతేకాకుండా ప్రైవేట్ పాఠశాలలపై ప్రభుత్వం నిర్దిష్టమైన ఫీజులను ప్రకటించి, కఠినమైన నిబంధనలు పెట్టినప్పుడే మన ప్రాథమిక హక్కు అయిన విద్య అందరికీ అందుతుందని ఆ దిశగా ప్రభుత్వాలు కృషి చేయాలని అంబేద్కర్ ఆశయ సాధన సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాపోల శ్రీరాములు, గరుగుల యాకయ్య, రాపోలు వెంకటేష్, మేడే శ్రీకాంత్, గణేష్, రామకృష్ణ, మాలాద్రి, గల్ల వెంకటేశ్వర్లు, జె శ్రీనివాస్, యాట శ్రీను తదితరులు పాల్గొన్నారు.



## మల్కాజిగిరి చౌరస్తాలో ప్రొఫెసర్ జయశంకర్ సార్ వర్ధంతి సందర్భంగా ఘన నివాళి

**(వినోద్, ప్రజా తీర్పు, మల్కాజిగిరి )జూన్ 21**

తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య జయశంకర్ సార్ వర్ధంతి సందర్భంగా ఆదివారం మల్కాజిగిరి చౌరస్తాలో ఏర్పాటుచేసిన ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు తెలంగాణ ఆత్మగౌరవానికి చిరునామా, ఉద్యమానికి ఊపిరి.తెలంగాణ సిద్ధాంతానికి మార్గదర్శి.ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ ఆశయాలు చిరస్మరణీయం.తన జీవితాన్ని తెలంగాణకు అంకితం చేసిన గొప్ప పోరాట యోధుడు అని బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారుడు బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ కార్పొరేటర్ బద్దం పరుశురాం రెడ్డి, మల్కాజిగిరి మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్, ఖలీల్, నర్సింగ్,ఉపేందర్, నీలం సతీష్,సైదులు, ఉస్మాన్,రాము యాదవ్,చిన్న యాదవ్,సిక్కా ప్రభాకర్,నర్సింగరావు, శ్రీకాంత్ యాదవ్, శ్రీనివాస్, సతీష్, శ్రీకాంత్, నవీన్, కుమార్, బిక్షపతి, నర్సింగ్ రావు, బాలకృష్ణ, మల్లేష్ యాదవ్, మరియు బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## ఆర్టీ ఫీషియల్ ఇంటెలిజెన్స్(AI) డిజిటల్ లెర్నింగ్ పై శిక్షణ....

దార్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో.....

**(పగడాల రామారావు ప్రజా తీర్పు గార్ల మండల ప్రతినిధి) జూన్ 21**

గార్ల. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆర్టీ పఫీషియల్ ఇంటెలిజెన్స్ ( కృత్రిమ మేధస్సు ) డిజిటల్ లెర్నింగ్ పై మహబూబాబాద్ జిల్లా స్థానిక మండల కేంద్రంప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 19,20 జూన్ 2026 తేదీలలో నిర్వహించిన అన్న అక్క మెంటర్షిప్ కలిగిన ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ గౌరవ శ్రీ డాక్టర్ డి.రాజు అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. కళాశాలలో ఐదవ సెమిస్టర్ తృతీయ సంవత్సరం విద్యార్థిని విద్యార్థులకు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ డిజిటల్ లెర్నింగ్ పరిజ్ఞానంపై ఈ శిక్షణ కార్యక్రమాన్ని ప్రిన్సిపల్ నిర్వహించారు. ఈ శిక్షణ సదస్సుకు కేసముద్రం పాలిటెక్నిక్ కళాశాల అధ్యాపకులు ఆర్. వెంకటేశ్వర్లు మాస్టర్ ట్రైనర్ గా హాజరై ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ డిజిటల్ లెర్నింగ్ శిక్షణపై తమ అమూల్యమైన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గార్ల కేసముద్రం కళాశాలల నోడల్ అధికారులు , తృతీయ సంవత్సరం విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. తదితరులు పాల్గొన్నారు.

## మార్షల్ ఆర్ట్స్‌లో శ్రీ చైతన్య విద్యార్థి ఘనత..

- ప్రతిష్టాత్మక బ్లాక్ బెల్ట్ సొంతం
- విద్యార్థికి యాజమాన్యం ఘన సత్కారం

**( కవ్వాల సురేందర్, ప్రజాతీర్పు, వేములవాడ) జూన్ 21:**



కరాటే గ్రేడింగ్ పరీక్షల్లో వేములవాడకు చెందిన విద్యార్థి అద్భుత ప్రతిభ కనబరిచి బ్లాక్ బెల్ట్ సాధించినట్టు రాజన్న సిరిసిల్ల ఒ కి నా వా స్పోర్ట్స్ కరాటే అకాడమీ ఫౌండర్, మాస్టర్ అబ్దుల్ మన్నాన్ తెలిపారు. కరీంనగర్ పట్టణంలోని ఇంగ్లీష్ యూనియన్ స్కూల్‌లో ఆదివారం ఒకినావా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించారు. వేములవాడ ఒకినావా స్పోర్ట్స్ కరాటే అకాడమీ మాస్టర్ అబ్దుల్ మన్నన్ పర్యవేక్షణలో శిక్షణ పొందుతున్న శ్రీ చైతన్య పాఠశాల పదో తరగతి విద్యార్థి దూలం యశ్వంత్ ఈ పరీక్షల్లో తన సత్తా చాటాడు. కరాటేలో అత్యంత కఠినమైన కటాస్, కుమిటే విన్యాసాలను అద్భుతంగా ప్రదర్శించి ప్రతిష్టాత్మక 'బ్లాక్ బెల్ట్' కైవసం చేసుకున్నాడు. ఒకినావా మార్షల్ ఆర్ట్స్ చీఫ్ ఎగ్జామినర్ కే. వసంత్ కుమార్ చేతుల మీదుగా యశ్వంత్ బ్లాక్ బెల్ట్‌తో పాటు ప్రశంసా పత్రాన్ని అందుకున్నాడు. కరాటే గ్రేడింగ్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన యశ్వంత్‌ను ఒకినావా స్పోర్ట్స్ కరాటే అకాడమీ జిల్లా అధ్యక్షులు కొండ దేవయ్య, శ్రీ చైతన్య విద్యాసంస్థల ఏజీఎం ముద్రకోల రాజు, ప్రిన్సిపాల్ సుదీష్ కుమారి ప్రత్యేకంగా అభినందించారు. చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి పాఠశాల కీర్తిని దశదిశలా చాటడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కరాటే శిక్షకులు కొమురవెల్లి భూమేష్, చింతకుంట తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# యోగ సాధనతో శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుంది

జిల్లా ఎస్పీ అశోక్ కుమార్

జగిత్యాల జిల్లా పోలీస్ చే అంతర్జాతీయ యోగా దినోత్సవం...

**( గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్ ) జూన్ 21.**



యోగా సాధనతో శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయం ఆవరణలో ఆదివారం ప్రత్యేక యోగా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ పాల్గొని పోలీసు అధికారులు, సిబ్బందితో కలిసి యోగా ఆసనాలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ.. యోగా భారతదేశం ప్రపంచానికి అందించిన అమూల్యమైన వరమని, ప్రతి ఒక్కరి జీవితంలో యోగా ఒక భాగం కావాలని సూచించారు. నిత్య జీవితంలో యోగా సాధన చేయడం ద్వారా శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత, ఏకాగ్రత పెంపొందడంతో పాటు ఒత్తిడి తగ్గి ఆరోగ్యవంతమైన జీవన విధానం అలవడుతుందని తెలిపారు.ప్రస్తుతం వేగవంతమైన జీవనశైలిలో ఉద్యోగ బాధ్యతలు, వ్యక్తిగత ఒత్తిళ్ల మధ్య ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి యోగా ఎంతో ఉపయుక్తమని పేర్కొన్నారు. ముఖ్యంగా పోలీసు శాఖలో విధులు నిర్వహించే సిబ్బంది శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండేందుకు యోగా అత్యంత అవసరమని అన్నారు. ప్రతి ఒక్కరూ రోజూ కనీసం 30 నిమిషాల పాటు యోగా సాధన చేయాలని, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని ఎస్పీ పిలుపునిచ్చారు. అనంతరం యోగా శిక్షకుల ఆధ్వర్యంలో సూర్యనమస్కారాలు, ప్రాణాయామం, వివిధ యోగా ఆసనాలు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, సిబ్బంది యోగా ద్వారా శారీరక ఉల్లాసం, మానసిక ప్రశాంతత పొందినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ చేతన్ నితిన్, డీఎస్పీ పురుషోత్తం రెడ్డి, ఇన్స్పెక్టర్లు రామ్ నర్సింహారెడ్డి, కరుణాకర్, సుధాకర్, వేణు,ఆరిఫ్ అలీఖాన్,ఎస్.ఐలు రణధీర్ రావు, శ్రీధర్ రెడ్డి,ఉమసాగర్, కుమారస్వామి, సధాకర్, మల్లేశం,సిబ్బంది పాల్గొన్నారు.



## నిర్మల్ పోలీస్... మీ పోలీస్

- యోగ సాధన – ఆరోగ్యకరమైన వృద్ధాప్యం కోసం యోగా
- 12వ అంతర్జాతీయ యోగ దినోత్సవ సందర్భంగా జిల్లా లో అన్ని పోలీసు కార్యాలయాల్లో యోగా నిర్వహణ
- ఎస్పీ క్యాంప్ కార్యాలయం లో యోగా నిర్వహించిన జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల

**నిర్మల్ జిల్లా ప్రతినిధి,జూన్ 21(ప్రజాతీర్పు ):**

ప్రపంచ 12వ యోగా దినోత్సవం పురస్కరించుకొని ఆదివారం ఎస్పీ క్యాంప్ కార్యాలయం లో ఏర్పాటుచేసిన యోగా దినోత్సవ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ పాల్గొని సిబ్బందితో కలిసి యోగా నిర్వహించారు. మొదటగా యోగా శిక్షకుడు హెడ్ కానిస్టేబుల్ బాలాజీ యోగ ను సిబ్బందికి తెలియజేస్తూ, సూర్య నమస్కారాలు, ప్రాణాయామము, ఆసనములు సిబ్బంది ద్వారా చేయించడం జరిగింది. యోగా దినోత్సవం లో భాగంగా జిల్లా ఎస్పీ తో సహా సిబ్బంది అందరూ వివిధ రకాల సూర్య నమస్కారాలు, ఆసనములు, వివిధ రకాల ప్రాణాయాములు స్వయంగా చేయడం జరిగింది. ఈ సందర్భంగా సిబ్బందిని ఉద్దేశిస్తూ జిల్లా ఎస్పీ మాట్లాడుతూ మొదటగా సిబ్బందికి పన్నెండవ అంతర్జాతీయ యోగా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆధునిక సమాజపు పోకడలకు లొంగిపోయి, అనారోగ్యంతో కునారిల్లుతున్న మనిషికి యోగా ప్రకృతిసిద్ధమైన శక్తిని అందిస్తుందని అన్నారు.ప్రపంచవ్యాప్తంగా యోగా దినోత్సవం జరుపుకోవడం జరుగుతుందన్నారు. అతి చిన్న వయసులోనే రోగాలకు గురవుతూ ప్రమాద పరిస్థితులు నెలకొంటున్న నేటి పరిస్థితుల్లో యోగా, సూర్య నమస్కారాలు, నడక వంటివి మన దినచర్యలో భాగంగా చేసుకోవాలని సూచించారు. యోగ అనేది వయసుకు సంబంధం లేకుండా అందరూ చేసే ఒక సాధనమని పేర్కొంటూ, యోగా వల్ల, ఆసనాల వల్ల అనారోగ్య బారిన పడకుండా, శారీరక దృఢత్వాన్ని కాపాడుకో వచ్చని పేర్కొన్నారు. ముఖ్యంగా పోలీసులు రేయింబవళ్లు 24 గంటలు విధులను నిర్వర్తిస్తుంటారని వారికి యోగ ఎంతగానో తోడ్పాటు అందజేస్తుందని, ఆరోగ్యాన్ని కాపాడుతూ విధులను నిర్వర్తించాలని సూచించారు. యోగ ప్రాణాయామము ఆసనాలు వలన మానసిక, శరీరక విశ్రాంతి, ఉపశమనం లభించి ప్రశాంతత లభిస్తుందని తెలిపారు.గుండెకు, శరీరానికి, మనసుకు అన్నిటికీ యోగ ఉత్తమమైన మార్గమని తెలిపారు. ఈరోజు జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని పోలీసు కార్యాలయాల్లో సిబ్బంది యోగా దినోత్సవం నిర్వహించుకోవడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ జానకి షర్మిల తో పాటు ఆర్ ఐ లు రామ్ నిరంజన్ రావ్, శేఖర్,రామక్రిష్ణ, ఆర్ఎస్ఐ లు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.




## మేడిపల్లి లోని ఉప్పల్ కోర్టు కాంప్లెక్స్‌లో యోగా కార్యక్రమం

**మేడిపల్లి/ జూన్ 21 ( ప్రజాతీర్పు )**

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని మేడిపల్లిలోని ఉప్పల్ కోర్టు ఆవరణలో ఆదివారం యోగా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, పోలీసు సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని వివిధ యోగా ఆసనాలు, ప్రాణాయామాలు చేశారు. యోగా శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతతను పెంపొందిస్తుందని, రోజువారీ జీవితంలో యోగాను అలవాటు చేసుకోవడం ద్వారా ఆరోగ్యకరమైన జీవనం సాధ్యమవుతుందని పాల్గొన్న వారు పేర్కొన్నారు. యోగా యొక్క ప్రాముఖ్యతను ప్రజలకు వివరించి, ప్రతి ఒక్కరూ యోగాను తమ దినచర్యలో భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమం ఆహ్లాదకర వాతావరణంలో విజయవంతంగా జరిగింది.ఈ కార్యక్రమంలో ఒకటవ అదనపు జూనియర్ న్యాయమూర్తి ముకేష్, రెండవ అదనపు జూనియర్ న్యాయమూర్తి వీరన్న, కేంద్ర ప్రభుత్వ అడిషనల్ స్టాండింగ్ కౌన్సిల్ మెంబర్ నర్సింగోజు నరేష్ కుమార్,సత్యనారాయణ, సుధాకర్, రాధాకృష్ణ,పవన్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి ,నాగరాజు, సంధ్యా కిరణ్ , పురుషోత్తం,పలువురు న్యాయవాదులు కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.



## పద్మశాలి సంఘం అధ్యక్షులుగా మల్లయ్య, విష్ణు

**రామడుగు, జూన్ 21 (ప్రజాతీర్పు ప్రతినిధి)**

రామడుగు మండలం గోపాల్‌రావుపేట గ్రామంలో పద్మశాలి సేవా సంఘం మరియు పద్మశాలి యువజన సంఘం నూతన కమిటీల ఎన్నికలు సంఘం ఆవరణలో నిర్వహించారు. ఎన్నికల అధికారిగా జిల్లా పద్మశాలి నాయకులు, లయన్స్ క్లబ్ గవర్నర్ మోర భద్రేశం వ్యవహరించారు. ఈ ఎన్నికల్లో పద్మశాలి సేవా సంఘం అధ్యక్షుడిగా కొలిపాక మల్లయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా కొలిపాక మల్లేశం, ప్రధాన కార్యదర్శిగా కొలిపాక కమలాకర్, కార్యనిర్వహక కార్యదర్శిగా రాంపల్లి శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శిగా మచ్చ గంగయ్య, కోశాధికారిగా సిరిపురం మల్లేశం ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా నల్ల శ్రీనివాస్, కొలిపాక నాగరాజ్, కొలిపాక లక్ష్మణ్, అలువాల శంకర్‌లు ఎన్నికయ్యారు. అలాగే పద్మశాలి యువజన సంఘం అధ్యక్షుడిగా అలువాల విష్ణు ఏకగ్రీవంగా ఎన్నిక కాగా, ఉపాధ్యక్షుడిగా కొలిపాక శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా రుద్ర నాగరాజ్, కార్యనిర్వహక కార్యదర్శిగా మామిడాల నాగరాజ్, సంయుక్త కార్యదర్శిగా అలువాల గంగాధర్, కోశాధికారిగా కొలిపాక ప్రవీణ్ ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా కొలిపాక కమలాకర్, ఎలిగేటి మహేష్, గోనె రమేష్, ఎలిగేటి మహేష్, ఏన్నం రామాంజనేయులు ఎన్నికయ్యారు. సలహాదారులుగా సిరిపురం సత్యనారాయణ, మచ్చ లచ్చయ్య, అలువాల సత్యనారాయణలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు సంఘ అభివృద్ధికి, పద్మశాలి సామాజిక వర్గ అభ్యున్నతికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘ సభ్యులు పాల్గొన్నారు.




## ఇంజినీరింగ్ కళాశాలలో బాలుర, బాలికల హాస్టళ్ల నిర్మాణానికి పరిపాలనా ఆమోదం

**హుస్నాబాద్ జూన్ 21 ప్రజాతీర్పు**

హుస్నాబాద్‌లోని శాతవాహన విశ్వవిద్యాలయ ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థుల వసతి సౌకర్యాల కల్పనకు కీలక అడుగు పడింది. శాతవాహన విశ్వవిద్యాలయం 86వ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు, ఇంజినీరింగ్ కళాశాలలో బాలుర హాస్టల్ మరియు బాలికల హాస్టల్ నిర్మాణ పనులకు అధికారికంగా ఎంట్రస్ట్మెంట్ ఆర్డర్లు జారీ చేసింది. ప్రతి హాస్టల్ నిర్మాణానికి రూ. 7.28 కోట్ల (728 లక్షలు) అంచనా వ్యయంతో రెండు హాస్టల్ లు గర్ల్స్ అండ్ బాయ్స్ హాస్టల్ నిర్మాణానికి మొత్తం రూ. 14.56 కోట్లు అంచనా వ్యయం తో పనులను చేపట్టాలని నిర్ణయించారు. ఈ నిర్మాణ బాధ్యతలను తెలంగాణ స్టేట్ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కు అప్పగించారు. హుస్నాబాద్ మండలం ఉమ్మాపూర్ గ్రామ పరిధిలోని సర్వే నెం. 132/1లో ఉన్న 36 ఎకరాల ప్రభుత్వ భూమిలో హాస్టళ్ల నిర్మాణం చేపట్టనున్నారు. ప్రణాళిక, డిజైనింగ్, నిర్మాణ పర్యవేక్షణ, ఈ–టెండర్ ప్రక్రియ నిర్వహణతో పాటు పనులను వేగవంతంగా ప్రారంభించాలని సంబంధిత అధికారులను విశ్వవిద్యాలయం ఆదేశించింది. ఈ నిర్మాణాలకు అవసరమైన నిధులను తెలంగాణ ప్రభుత్వం దశలవారీగా విడుదల చేయనుంది. పనులను 2027 జూన్ 30 నాటికి పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ హాస్టళ్ల నిర్మాణం పూర్తయితే హుస్నాబాద్ ఇంజినీరింగ్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన వసతి సౌకర్యాలు అందుబాటులోకి రావడంతో పాటు, గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు ఉన్నత విద్యాభ్యాసం మరింత సులభతరం కానుంది. హాస్టల్ భవన నిర్మాణాలకు నిధులు మంజూరు కావడం పట్ల స్థానిక ప్రజా ప్రతినిధి లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ మంత్రి పొన్నం ప్రభాకర్ కి ధన్యవాదాలు తెలిపారు.



## ఈనెల 26న తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల రాష్ట్ర సదస్సు

- ఎల్‌బీనగర్‌లోని స్వకులశాలి సమాజ భవనంలో నిర్వహణ
- ఉద్యోగుల సమస్యలు, సంక్షేమంపై విస్తృత చర్చ
- పద్మశాలి ఉద్యోగులందరూ పాల్గొని విజయవంతం చేయాలి: అనంతుల లక్ష్మీనారాయణ

**భద్రాద్రి కొత్తగూడెం రూరల్, జూన్ 21,(ప్రజా తీర్పు )**

తెలంగాణ రాష్ట్ర పద్మశాలి ఉద్యోగుల సంఘం (ప్యాఖా) ఆధ్వర్యంలో ఈనెల 26న హైదరాబాద్‌లోని ఎల్‌బీనగర్‌లో గల స్వకులశాలి సమాజ భవనంలో రాష్ట్ర స్థాయి పద్మశాలి ఉద్యోగుల సదస్సు నిర్వహించనున్నట్లు సంఘం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు అనంతుల లక్ష్మీనారాయణ తెలిపారు. ఆదివారం రాష్ట్ర సదస్సుకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర అధ్యక్షుడు ఈగ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ సదస్సులో పద్మశాలి ఉద్యోగుల సంక్షేమం, వారు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కార మార్గాలు, సంఘం భవిష్యత్ కార్యాచరణతో పాటు పలు కీలక అంశాలపై విస్తృతంగా చర్చించనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి పద్మశాలి ఉద్యోగులు ఒకే వేదికపై సమావేశమై పరస్పర అవగాహన పెంపొందించుకోవడంతో పాటు సంఘ బలోపేతానికి అవసరమైన కార్యాచరణను రూపొందించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని పద్మశాలి ఉద్యోగులందరూ పెద్ద సంఖ్యలో హాజరై రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దూలం నటరాజ్, గొట్టిముక్కుల మహేందర్, పసునూతి వెంకటేశ్వర్లు, కొండి పద్మజ, పుట్ట లింగమూర్తి, దిగిదారి రాము తదితరులు పాల్గొన్నారు.



## జాతీయ లోక్ అదాలత్ లో 797 కేసుల పరిష్కారం

- నర్సంపేట కోర్టు ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి యూసఫ్.

**నర్సంపేట జూన్ 21 ప్రజా తీర్పు**

నర్సంపేట మెజిస్ట్రేట్ కోర్టు ప్రాంగణంలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. లీగల్ సర్వీస్ అథారిటీ, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి యూసఫ్ ఆధ్వర్యంలో రాజీ కుదుర్చుకున్న ఇరువర్గాలకు సంబంధించిన పలు కేసులను జాతీయ లోక్ అదాలత్ లో పరిష్కరించారు. అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి గిరిధర్, సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ రంగనాథ స్వామి లు పాల్గొన్నారు. రాజీమార్గమే, రాజమార్గం... లోక్ అదాలత్ అని క్షణికావేశానికి చేసిన తప్పులకు సంవత్సరాల తరబడి కోర్టులో చుట్టూ తిరగకుండా రాజీపడి ప్రశాంత జీవనం గడపాలని జడ్జి అన్నారు. మన నర్సంపేటలో బెస్ట్ జ్యుడీషియల్ ఆఫీసర్స్ స్పీడ్ జస్టిస్ అందించడానికి సిద్ధంగా ఉన్నారని కారో సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కోర్టుకి వచ్చిన ప్రతి అర్జీదారికి న్యాయం అందించాలని స్ఫూర్తి కలిగి ఉన్న మన న్యాయమూర్తులు ఉన్నారని అన్నారు. లాంగ్ పెండింగ్ కేసులు అన్ని పొజిషన్ ఫెయిల్యూర్ కింద కేసులు క్లోజ్ చేసే న్యాయమూర్తులు కలరు. మెయింటెనెన్స్ కేసులలో స్పీడ్ అందించే కోర్టుకు వచ్చే ఆడపడుచులకి గ్రాంటింగ్ జస్టిస్ ప్రాసిక్యూషన్ ఫెయిల్యూర్ 12 ది లోక్ అదాలత్ సక్సెస్ చేయడంలో పూర్తి సహకారం అందించిన అడ్వకేట్స్, పోలీస్ ఆఫీసర్స్ సిబ్బంది అందరూ సహకరించారని వారు అన్నారు. ఈ లోక్ అదాలత్ కార్యక్రమంలో సీనియర్ పి.పి రవి కిరణ్, ఆర్టిఐ సీనియర్ న్యాయవాది రహీముద్దీన్, లోక్ అదాలత్ మెంబర్ ఠాకూర్ సునీత, దొంతి సాంబయ్య, అడ్వకేట్స్ కోర్టు స్టాఫ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# యోగాతో సంపూర్ణ ఆరోగ్యం కలెక్టర్ ప్రతిమా సింగ్

- ఆరోగ్యవంతమైన వృద్ధాప్యం కోసం యోగ" అనే థీమ్

**మెదక్,జూన్ 21 ( ప్రజాతీర్పు):**



భారతదేశం ప్రపంచానికి అందించిన గొప్ప సంపద యోగ వయో, లింగ భేదం లేకుండా అందరూ యోగాను సాధన. చేయాలి యోగా గురువు రవి అధికారులతో ఆసనాలు చేయించారు కలెక్టర్ ప్రతిమాసింగ్ యోగాసనాలు వేసి అందర్నీ ఉత్తేజపరిచారు. మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ఆదివారం మెదక్ పట్టణంలోని ఇందిరాగాంధీ స్టేడియం ప్రాంగణంలో ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం -- 2026 కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ఇన్చార్జి అదనపు కలెక్టర్ అంబదాస్ రాజేశ్వర్, మెదక్ ఆర్డీవో రమాదేవి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి భూక్య జ్ఞానేశ్వర్ , డిసిహెచ్ఎస్ డాక్టర్ శివదయాల్ , ఆయుష్ విభాగం మోహన్ రెడ్డి , జిల్లా యువజన క్రీడల నిర్వహణ అధికారి రమేష్ ,విశిష్ట యోగ గురువు ఆకుల రవి తో కలిసి జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా కలెక్టర్ ప్రతిమాసింగ్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. "ఆరోగ్యవంతమైన వృద్ధాప్యం కోసం యోగ" అనే థీమ్‌తో నిర్వహించిన ఈ కార్యక్రమంలో,జిల్లా కలెక్టర్ , ప్రతి మాసింగ్ ఇన్చార్జి.అదనపు కలెక్టర్ అంబదాస్ రాజేశ్వర్ , మెదక్ ఆర్డీవో రమాదేవి లు స్వయంగా యోగా ఆసనాలు చేస్తూ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సొంతమవుతుందనిఆరోగ్యవంతమైన వృద్ధాప్యం కోసం యోగ" అనే థీమ్ తో ముందుకు సాగాలన్నారు మా నవ శక్తులన్నింటినీ ఏకం చేసే ఏకాగ్రత సాధించడం యోగాకే సాధ్యం. అన్నారు భారతదేశం ప్రపంచానికి అందించిన గొప్ప సంపద యోగ అని పిలుపునిచ్చారు. "యోగ అనేది కేవలం వ్యాయామం మాత్రమే కాదు... శారీరక ఆరోగ్యం, మానసిక ప్రశాంతత, క్రమశిక్షణతో కూడిన జీవన విధానం. ప్రతి ఒక్కరూ యోగాను దైనందిన జీవితంలో భాగం చేసుకుని ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి కృషి చేయాలి. భారతదేశం ప్రపంచానికి అందించిన గొప్ప సంపద యోగ" అని పేర్కొన్నారు. అనంతరం యోగాలో పాల్గొన్న ఆయుష్ అధికారులు, విద్యార్థినీ విద్యార్థులు , క్రీడాకారులు క్రీడాభిమానులతో కలెక్టర్ ఫోటో సెషన్ లో కార్యక్రమంలో పాల్గొన్నారు.



## ఫీజు నియంత్రణకు చట్టం తీసుకురావాలి

**(అనంతుల శ్రీనివాస్ గౌడ్, ప్రజా తీర్పు సూర్యాపేట జిల్లా ప్రతినిధి) జూన్ 21**

ప్రభుత్వ పాఠశాలల్లో మౌళిక సదుపాయాలు, నాణ్యమైన విద్యను కల్పించడంలో ప్రభుత్వం విఫలమైంది. ఆ నెపం ప్రభుత్వ ఉపాధ్యాయుల మీద నెట్టి వేస్తున్నారు. ముఖ్యమంత్రి 27 వేల పాఠశాలను 4 వేలకు తగ్గించాలని ప్రకటించడం ఖండించదగ్గ విషయం. ప్రభుత్వ విధానాల మూలంగానే ప్రజలు వారి పిల్లలను ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో చేర్పిస్తున్నారు. ప్రైవేటు విద్యాసంస్థల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల సంఖ్య నేడు 65% కి పైగా పెరిగింది. విద్యబోధన అనగానే ప్రైవేటు, కార్పోరేట్ పాఠశాలలో మాత్రమే నాణ్యమైన విద్య అందే అవకాశం ఉంది అనే భావన తల్లిదండ్రుల్లో నెలకొనే విధంగా ఆయా ప్రైవేటు కార్పొరేట్ యాజమాన్యాలు ప్రచారం చేస్తున్నాయి. మండల, జిల్లా స్థాయి అధికారులు ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థల ప్రలోభాలకు గురై తనిఖీలు నిర్వహించడం లేదు. జీవో నెంబర్ 1 అమలు చేయడం లేదు 2009 చట్టంలోని అంశాలను అమలు చేయడం లేదు. ఈ ఏడాది ప్రారంభానికి ముందే తెలంగాణ సర్కారు ఫీజుల నియంత్రణ చట్టం రూపొందిస్తామని చెబుతూ దాట వేయడం తో ప్రైవేటు పాఠశాలల ఫీజుల దోపిడీ నిరాటంకంగా సాగుతోంది. పాలకుల వైఫల్యం, అధికారుల పర్యవేక్షణ లోపంతో అధిక ఫీజుల భారం తట్టుకోలేక విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. తక్షణమే ఫీజుల నియంత్రణ ఆవశ్యకమైన విషయంగా దీన్ని చట్టం చేసి అమలు పరచాలని ప్రొఫెసర్ కె. లక్ష్మీనారాయణ విద్యా పరిరక్షణ కమిటీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ అన్నారు. భారతదేశంలో తెలంగాణలో జరుగుతున్న ప్రైవేటీకరణ మరి ఎక్కడా లేదు అన్నారు. కామన్ స్కూల్ విద్యా విధానం లేకుండా కామన్ ఎంట్రన్స్ టెస్ట్ ఎలా పెడతారని ప్రశ్నించారు. దేశంలో రోజు రోజుకు తీవ్రమవుతున్న ద్రవ్యోల్బణంతో ప్రజల వినియోగ స్థాయి దిగజారి అనేక కష్టాల పాలవుతున్నారు. విద్యారంగంలో అసమానతలు ఉండకూడదు. విద్య అందరికీ సమానంగా అందినప్పుడే సమాజం పురోగమిస్తుందన్నారు. కాని పాలకులు ఉచితంగా విద్యనందించే భాద్యత నుండి రోజు రోజుకు వైదొలుగుతూ విద్యా రంగాన్ని పూర్తిగా ప్రైవేటు పరం చేస్తున్నారు. బడ్జెట్లో విద్యారంగానికి 15% నిధులు కేటాయిస్తామని మ్యానిఫెస్టోలో చేర్చి కేవలం 8 శాతం నిధులు కేటాయించారు. వెంటనే ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసే విధంగా బడ్జెట్లో 20 శాతం నిధులను కేటాయించాలి ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలను ప్రభుత్వమే స్వాధీనం చేసుకొని నడపాలన్నారు.



## ప్రజాక్షేత్రంలోనే తేల్చుకుందాం: ఎమ్మెల్యే కోరం కనకయ్య

**(పొనకంటి ఉపేందర్ రావు ప్రజాతీర్పు ఇల్లందు) జూన్ 21**

ఇల్లందు:నియోజకవర్గాన్ని ఎవరు అభివృద్ధి చేశారో ప్రజాక్షేత్రంలోనే తేల్చుకుందామని ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొంతమంది బీఆర్ఎస్ నాయకులు తాను డబ్బులు తీసుకొని బీఆర్ఎస్ పార్టీలో చేరానని, ఆ తర్వాత పార్టీని మోసం చేసి కాంగ్రెస్ పార్టీలో చేరానని ఆరోపించడం సిగ్గుచేటు అన్నారు. అప్పట్లో కేసీఆర్, హరీష్ రావు పిలిపించుకొని ఇల్లందు అభివృద్ధికి 200 కోట్లు ఇస్తామని, ఇల్లందు నియోజకవర్గంలోని రోళ్ళపాడు వద్ద 7వేల కోట్లతో రిజర్వాయర్ ఏర్పాటు చేసి ఇల్లందు ఏజెన్సీ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామని మాట ఇవ్వడం వలన తాను పార్టీ మారడం జరిగిందన్నారు. బీఆర్ఎస్ సమావేశంలో ఎమ్మెల్సీలు తాత మధుసూదన్, తక్కెళ్లపల్లి రవీందర్ మాట్లాడుతూ తాను పొంగులేటి డబ్బులకు అమ్ముడుపోయి పార్టీ మారానని చెప్పడం సిగ్గుచేటు అన్నారు. వారిలాగా నేను నామినేటెడ్ ఎమ్మెల్సీ పదవులను పొందలేదని, జనం చేత ఎన్నుకోబడినఎమ్మెల్యేగారెండుసార్లు, ఒకసారి జెడ్పీ చైర్మన్‌గా చేయడం జరిగిందన్నారు. తాను టేకులపల్లి మండలం నుంచి జెడ్పీటీసీగా పోటీ చేసి గెలవడం వలన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జెడ్పీ చైర్మన్ పదవి ఇచ్చారని, బిఆర్ఎస్ హయాంలో జెడ్పీ చైర్మన్ పదవికి ఒక్క రూపాయి బడ్జెట్ కూడా కేటాయించలేదని, కుర్చీకి మాత్రమే పరిమితమయ్యారని అన్నారు. ఎంతోమంది ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు వారి ఊరు అభివృద్ధి కోసం తనను బడ్జెట్ కేటాయించాలని కోరడంతో చాలాసార్లు అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్‌ని కలిసినా ఒక్క రూపాయి బడ్జెట్ కూడా కేటాయించలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికీ ప్రతినెల 7వేల కోట్ల అప్పులను చెల్లిస్తూ, ఆరు గ్యారంటీలలో భాగంగా ఉచిత బస్సు, 200 యూనిట్ల ఉచిత కరెంటు, ఇందిరమ్మ ఇళ్లు, 500 రూపాయలకే గ్యాస్ వంటి సంక్షేమ పథకాలను ఎన్ని ఇబ్బందులు ఉన్నా ప్రవేశపెట్టడం జరుగుతుందన్నారు. ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగినా ఇల్లందు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ గెలుస్తుందని, బీఆర్ఎస్ పార్టీకి డిపాజిట్ కూడా దక్కదని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఏం చేసిందో, బీఆర్ఎస్ పార్టీ ఏం చేసిందో ప్రజలందరికీ తెలుసు అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కిరణ్ మిత్ర, ఏఎంసీ చైర్మన్ బానోత్ రాంబాబు, మున్సిపల్ వైస్ చైర్మన్ పెండేల రాజు, మాజీ మున్సిపల్ చైర్మన్ అనసూయ, మాజీ వైస్ చైర్మన్ పులిగండ్ల మాధవరావు, 22వ వార్డు కౌన్సిలర్ కొర్లపాటి శివ కిరణ్, కాంగ్రెస్ మండల పట్టణ అధ్యక్షులు మండల రాము, బోళ్ల సూర్యం, మహిళ అధ్యక్షురాలు స్వరూప, కోఆప్షన్ సభ్యులు మడుగు సాంబమూర్తి, హసీనా, సర్పంచులు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమ కారుల ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఆచార్య జయశంకర్ సార్ 15 వ వర్ధంతి.

**(దండే భూమన్న ప్రజా తీర్పు మంచిర్యాల జిల్లా ప్రతినిధి) జూన్ 21**



మంచిర్యాల జిల్లా కేంద్రంలో తెలంగాణ ఉద్యమ కారుల ఐక్య వేదిక, సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం మరియు బీసీ సంఘాల ఆధ్వర్యంలో తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం తన జీవితాన్నే అంకితం చేసిన తెలంగాణ జాతి పిత ఆచార్య కొత్తపల్లి జయశంకర్ సార్ గారి 15 వ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికన్న ముందు జయశంకర్ సార్ చిత్రపటానికి పలువురు ఉద్యమ నాయకులు పూలమాలలు వేసి వినమ్రంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమ కారుల ఐక్య వేదిక , సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు, బీసీ సంఘాల నాయకుడు గజెల్లి వెంకటయ్య మాట్లాడుతూ 1200 మంది విద్యార్థిని విద్యార్థుల ఆత్మ బలి దానల పునాదుల పైన ఏర్పడ్డ తెలంగాణ రాష్ట్రం , కేవలం బహుగోళిక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైనదని సామాజిక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం మరో ఉద్యమం చేయాల్సిన అవసరం ఉందని , ఉద్యమాల ద్వారా అమర వీరుల ఆత్మ బలిదానాల సాక్షిగా ఏర్పడ్డ తెలంగాణ రాష్ట్రం లో మెజారిటీ ప్రజలు అయినా బీసీ , ఎస్సీ ఎస్టీ మరియు మైనారిటీ లకు ఈ తెలంగాణ రాష్ట్రం లో రాజ్యాధికారం అందని ద్రాక్షే నని తేలిపోయినదని కొత్తగ ఏర్పడ్డ రాష్ట్రం లో అతి తక్కువ జనాభా కలిగిన రావు లు , రెడ్డి ల రాజ్యాధికారమే గత పన్నెడు నర సంవత్సరాల నుండి ఏలుబడి లో ఉన్నదని , ఇప్పటికీ తెలంగాణ రాష్ట్రం లో సీమాంధ్ర పెట్టుబడి దారుల రాజకీయ ఆధిపత్యమే కొనసాగుతున్నట్లు ఈ మధ్యలో జరిగిన కొన్ని సంఘటనలే ఉదాహరణ అని పేర్కొన్నారు . తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు చేసుకున్నదే ఆత్మ గౌరవం కోసం , తెలంగాణ ప్రజల అస్తిత్వం కోసం తెలంగాణ ప్రజల సాహిత్య , సంప్రదాయాలు పరిరక్షణ కోసం అని కానీ ఇప్పటికీ సీమాంధ్ర రాజకీయ నాయకులు తెలంగాణ లోని ఉద్యమ కారుల , మేధావుల , ఎలక్ట్రానిక్ ప్రింట్ మీడియా మరియు ప్రజల పై వారి ఆధిపత్యాన్ని కొనసాగిస్తూ , తెలంగాణ ప్రజల ఆత్మ గౌరవాన్ని దెబ్బ తీసే విధంగా వ్యవహరిస్తున్నారాని ఆగ్రహం వ్యక్తం చేశారు. అందుకే తెలంగాణ లోని మెజారిటీ ప్రజలైన బీసీ , ఎస్సీ, ఎస్టీ ల మైనారిటీ లకు రాజ్యాధికారం దక్కే విధంగా మరో ఉద్యమం చేసి అమర వీరుల ఆశయాన్ని సాధించుకోవాలని కోరినారు. 2023 ఎన్నికల కన్నా ముందు తెలంగాణ ప్రజలకు కాంగ్రెస్ పార్టీ చేసిన వాగ్దానాలను వెంటనే అమలు చేయాలని , నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్ ప్రకటించి ఉద్యోగాలకు నోటిఫికేషన్లు వేసి , ప్రతి సంవత్సరానికి 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని చేసిన వాగ్దానాన్ని కాంగ్రెస్ పార్టీ నిలుపుకోవాలని కోరినారు . తెలంగాణ ఉద్యమ కారులకు 250 గజాల ఇంటి స్థలం, 50,000 పెన్షన్ , ఉచిత రవాణా సౌకర్యాలు , ఉద్యమ కారులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని ఈ సందర్భంగా డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు గజెల్లి వెంకటయ్య, గౌరవ అధ్యక్షులు రాళ్లబండి రాజన్న , ప్రధాన కార్యదర్శి పుదారి నర్సయ్య, నాయకులు సత్యనారాయణ , రాంరెడ్డి , రాజేశం , చందు , లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.. ఈ సందర్భంగా జై తెలంగాణ అంటూ జోహార్లు తెలంగాణ అమర వీరులకు అంటూ పోరాడుదాం సామాజిక తెలంగాణ రాష్ట్రం కోసం తెలంగాణ ఉద్యమ కారులారా ఏకం కండి అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు..

# రైతు సంక్షేమం దిశగా ప్రభుత్వం చర్యలు

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**(వి వెంకటేష్ ప్రజాతీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) జూన్ 21**



రైతు సంక్షేమం దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతుందని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. ఆదివారం జిల్లాలోని లక్షెట్టిపేట మండలం దౌడేపల్లి,చందారం, లో చందారం గ్రామ రైతు పొదుపు, పరపతి, మార్కెటింగ్ పరస్పర సహాయక సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాతీయ గ్రామీణ విత్తన ఉత్పత్తి - విత్తన శుద్ధి కేంద్రాన్ని డి.సి.పి. ఎ.భాస్కర్, మంచిర్యాల నియోజకవర్గ శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ, సంబంధిత అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం రైతు సంక్షేమం దిశగా అనేక చర్యలు చేపడుతుందని తెలిపారు. జిల్లాలోని రైతుల కొరకు విత్తన ఉత్పత్తి - విత్తన శుద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఇందు కొరకు అవసరమైన మెటీరియల్, ఎక్విప్మెంట్ సమకూర్చడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా దాదాపు 2 లక్షల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందని, ఇంకా 12 వేల క్వింటాళ్లు కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో అవసరమైన లారీలను సమకూర్చడం జరిగిందని, సింగరేణి సంస్థ, ఇసుక తరలింపు సంబంధిత లారీలను ధాన్యం కొరకు మళ్ళించడం జరిగిందని తెలిపారు. వర్షాలు రాకముందే ధాన్యం కొనుగోలు చేసి కేటాయించిన ప్రకారం గోదాములు, రైస్ మిల్లులకు తరలించడం జరిగిందని, రైతులకు ఎలాంటి నష్టం కలగకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. కొనుగోలు చేసిన 48 గంటల వ్యవధిలో చెల్లింపులు చేయడం జరిగిందని, దాదాపు 98 శాతం ధాన్యం కొనుగోలు సంబంధించి ఆయా రైతుల ఖాతాలలో నగదు జమ చేయడం జరిగిందని తెలిపారు. భూ సమస్యల పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవడంతో పాటు రైతుల నమోదు ప్రక్రియ చేపట్టడం జరిగిందని, రైతు సంక్షేమ పథకాలను అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. ఆధార్ లింకేజీ ద్వారా యూరియా, విత్తనాలు, ధాన్యం విక్రయ బుకింగ్ చేయడం జరుగుతుందని, సాదా బైనమా దరఖాస్తులను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. శాంతిభద్రతలు, సివిల్, కుటుంబ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవడంతో పాటు మారుమూల గ్రామాలలో సర్వే నిర్వహించడం జరుగుతుందని, పట్టాదారు, మోకా వివరాలు నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. అధికారుల సమన్వయంతో సర్వే ప్రక్రియ సమర్థవంతంగా చేపట్టి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని, ఆధార్, భూధార్ ప్రక్రియ పరిశీలన పకడ్బందీగా చేపట్టే విధంగా వ్యవసాయ శాఖ అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. పంట సాగులో రైతులు లబ్ధి పొందే విధంగా పంట మార్పిడి విధానం, సాగు మెలకువలు, లాభాలు, భూసారం పరిరక్షణ, నానో యూరియా వినియోగం వంటి అంశాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మంచిర్యాల శాసనసభ్యులు మాట్లాడుతూ జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు తో పాటు దాదాపు 22 వేల టన్నుల మొక్కజొన్నలు కొనుగోలు చేయడం జరిగిందని, జిల్లా వ్యాప్తంగా 452 కోట్ల చెల్లింపులు కాగా మంచిర్యాల నియోజకవర్గంలో దాదాపు 270 కోట్ల చెల్లింపులు జరిగాయని తెలిపారు. ఈసారి ఐ.కె.పి. వారికి కొనుగోలు కేంద్రాలు కేటాయించడం జరిగిందని, రాష్ట్ర వ్యాప్తంగా 20 శాతం కొనుగోలు కేంద్రాలు ఐకెపి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగిందని తెలిపారు. కడెం కాలువ 42వ డిస్టిబ్యూటరీ నుండి నీటిని అందించడం జరుగుతుందని తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో లారీలు, హమాలీల సమస్య లేకుండా చర్యలు తీసుకోవడం జరిగిందని, గతంలో ఎకరాకు 20 నుండి 22 క్వింటాళ్లు ధాన్యం దిగుబడి రాగా ఈసారి 28 నుండి 32 క్వింటాళ్ల ధాన్యం దిగుబడి వచ్చిందని తెలిపారు. రైతులకు ఎలాంటి నష్టం లేకుండా కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేటాయించిన ప్రకారం గోదాములకు తరలించి తగు చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతుందని, కొందరు ఉద్దేశపూర్వకంగా అసత్య ఆరోపణలతో రైతులను పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారని, రైతు సంక్షేమంలో రాజకీయాలకు అతీతంగా కలిసి రావాలని తెలిపారు. పంట సాగుకు సరిపడా సాగునీరు అందించడం జరిగిందని, పంట ఉత్పత్తికి అవసరమైన గోదాములు ఏర్పాటు చేసి అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. రైతులకు అవసరమైన నాణ్యమైన విత్తనాలు అందించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని, విత్తన శుద్ధి కేంద్రం ద్వారా మార్కెట్ ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# వైభవ్ విస్ఫోటం..11 బంతుల్లో అర్ధసెంచరీ

## యువభారత్ జయకేతనం

### ముక్కోణపు వన్డే లంకపై ఘన విజయం



ముక్కోణపు వన్డే సిరీస్‌లో యువ భారత్ జయకేతనం ఎగురవేసింది. అన్నింటా ఆధిపత్యం ప్రదర్శించిన కుర్రాళు శ్రీలంక గడ్డపై సింహనాదం చేశారు. టోర్నీలో పేలవ ఫామ్‌తో విమర్శలకు గురైన యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ టైటిల్ పోరులో ఆకాశమే హద్దుగా చెలరేగిన వేళ భారత్ 'ఏ' ట్రోఫీని సగర్వంగా ముద్దాడింది. ఆదివారం జరిగిన ఫైనల్లో హైదరాబాదీ తిలక్‌వర్మ సారథ్యంలోని భారత్ 'ఏ' 66 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. చిచ్చరపిడుగు సూర్యవంశీ(29 బంతుల్లో 94, 10ఫోర్లు, 8సిక్స్‌లు) వీరవిహారానికి తోడు కెప్టెన్ తిలక్‌వర్మ(90 బంతుల్లో 67, 4ఫోర్లు, సిక్స్) అర్ధసెంచరీతో భారత్ 'ఏ' 50 ఓవర్లలో 377-9 భారీ స్కోరు చేసింది. లంక బౌలర్లను ఊచకోత కోస్తూ సూర్యవంశీ కేవలం 11 బంతుల్లోనే అర్ధసెంచరీ మార్క్ అందుకున్నాడు. లిస్ట్-ఏ క్రికెట్‌లో ఇది సరికొత్త రికార్డుగా నమోదైంది. లంక బౌలర్లకు పట్టపగలే చుక్కలు చూపించిన ఈ బీహార్ బుడ్డోడు ఫోర్లు, సిక్స్‌లతో చెలరేగాడు. పిచ్‌పై బంతి పడటం ఆలస్యం దాని గమ్యస్థానం బౌండరీ అన్న తరహాలో సూర్యవంశీ చెలరేగిన తీరు అభిమానులను కట్టిపడేసింది. సహాన్(2-39), రవిందు ఫెర్నాండో(2-72), మతులాన్(2-82) రెండేసి వికెట్లు తీశారు. భారీ లక్ష్యఛేదనలో లంక 'ఏ' 47.1 ఓవర్లలో 311 ఆలౌటైంది. వనుజ సహాన్(62), సదీరా సమరవిక్రమ(52) అర్ధసెంచరీలతో ఆకట్టుకోగా, మిగతావారు విఫలమయ్యారు. యశ్ ఠాకూర్(3-45), విప్రాజ్ నిగమ్(3-60) మూడేసి వికెట్లతో లంక పతనంలో కీలకమయ్యారు. ధనాధన్ అర్ధసెంచరీతో జట్టు విజయంలో కీలకమైన సూర్యవంశీకి 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.

**ఆకాశమే హద్దుగా:**

టాస్ గెలిచిన కెప్టెన్ తిలక్‌వర్మ..మరో ఆలోచన లేకుండా బ్యాటింగ్ ఎంచుకోవడం భారత్ 'ఏ'కు కలిసొచ్చింది. సిరీస్‌లో భారీ స్కోర్లు చేయలేకపోయిన వైభవ్ కీలకమైన ఫైనల్లో తన ప్రతాపమేంటో చూపెట్టాడు. లంకతో 'సూపర్ ఓవర్' పోరులో జరిగిన ఘటనను దృష్టిలో పెట్టుకున్న వైభవ్ అంతే కసిగా ఆడాడు. ప్రియాంశ్ ఆర్య(39) జతగా ఈ యువ ఓపెనర్ విధ్వంసానికి వ్యూహరచన చేశాడు. బౌలర్ ఎవరన్నది లెక్కచేయని నైజంతో బ్యాటింగ్‌కు వచ్చిన ఈ బుడ్డోడు తాను ఎదుర్కొన్న తొలి 11 బంతుల్లోనే మ్యాచ్ గతిని మార్చేశాడు. వరుస బంతుల్లో 4,4,4, 6,6, 0, 6,4,4, 6,6తో 50 పరుగుల మార్క్ అందుకున్నాడు. ఇక్కడే సూర్యవంశీ విస్ఫోటం ఏ స్థాయిలో ఉందో అర్థమవుతుంది. లంక బౌలర్లను గల్లీ ప్లేయర్లుగా మారుస్తూ వైభవ్ కొట్టిన కొట్టుడుకు బౌండరీలు చిన్నబోయాయి. లంక పేసర్ దులజ్ సముదితను వైభవ్ ఓ ఆటాడుకున్నాడు. ప్రత్యర్థి పేసర్లను లక్ష్యంగా చేసుకుంటూ ఆన్‌సైడ్ దిశగా వైభవ్ బౌండరీల వర్షం కురిపించాడు. ఈ 15 ఏండ్ల కుర్రాడిని అడ్డుకునేందుకు ఆన్‌సైడ్‌లో ఎక్స్‌ట్రా ఫీల్డర్‌ను మోహరించినా..లాభం లేకపోయింది. ఎక్స్‌ట్రా కవర్‌లో వైభవ్ లాఫ్టెడ్ షాట్స్ సిక్స్‌లు మ్యాచ్‌కే హైలెట్‌గా నిలిచాయి. గుడ్‌లెంగ్త్ బంతులను కూడా వదిలిపెట్టని ఈ యువ బ్యాటర్ తన ఇన్నింగ్స్‌లో 10 ఫోర్లు, 8 భారీ సిక్స్‌లతో చెలరేగాడు. సెంచరీకి మరో ఆరు పరుగుల దూరంలో అరచింగె బౌలింగ్‌లో క్యాచ్ ఔట్ కావడంతో తొలి వికెట్‌కు 132 పరుగుల భాగస్వామ్యానికి బ్రేక్ పడింది. సూర్యవంశీ అందించిన శు భారంభాన్ని సహచర బ్యాటర్లు కొనసాగించారు. రుతురాజ్ గైక్వాడ్ (40), తిలక్‌వర్మ, కుమార్ కుశాగ్ర (36), ఆఖర్లో అనుకూల్‌రాయ్(15 బంతుల్లో 39, ఫోర్, 4సిక్స్‌లు) బ్యాట్లు ఝులిపించడంతో భారత్‌కు భారీ స్కోరు సాధ్యమైంది.

**లంక పడుతూ లేస్తూ:**

భారీ లక్ష్యఛేదనలో లంక ఇన్నింగ్స్ పడుతూ లేస్తూ సాగింది. యశ్ ఠాకూర్ ధాటికి లంక 'ఏ' టాపార్డర్ బ్యాటర్లు అవిష్క ఫెర్నాండో(3), నిరోషన్ డిక్వెల్లా (25), నువిండ్ ఫెర్నాండో (21) వికెట్లు కోల్పోయింది. పిచ్ పరిస్థితులను అనుకూలంగా మలుచుకుంటూ ఠాకూర్ బౌలింగ్ జోరుకు లంక బ్యాటర్లు ఆదిలోనే పెవిలియన్ చేరుకున్నారు. సదీర సమరవిక్రమ (52), కెప్టెన్ సహాన్ అరచిగె(38) నాలుగో వికెట్‌కు 53 పరుగులు జోడించగా, సహాన్(62), విజయ్‌కాంత్(39) కలిసి ఏడో వికెట్‌కు 77 పరుగులు జోడించారు. అయితే ఛేదించాల్సిన లక్ష్యం ఎక్కువ ఉండటం వరుస విరామంలో వికెట్లు కోల్పోవడం లంక కొంపముంచింది. ఠాకూర్‌కు తోడు నిగమ్, అనుకూల్ రాయ్ (2-42) రాణించడం భారత్‌కు కలిసొచ్చింది. 9 లిస్ట్-ఏ క్రికెట్‌లో 11 బంతుల్లో అర్ధసెంచరీ చేసిన తొలి బ్యాటర్‌గా వైభవ్ నిలిచాడు. గతంలో లంక బ్యాటర్ కౌశల్య వీరరత్నె (12 బంతుల్లో) పేరిట ఉన్న రికార్డు తాజాగా చెదిరిపోయింది.



# పేద ప్రజల అభివృద్ధి కాంగ్రెస్ ద్వారానే సాధ్యం

- కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు భూక్య గోపాల్ నాయక్..

**నర్సంపేట జూన్ 21 ప్రజా తీర్పు**

చెన్నారావుపేట మండలం అక్కల్ చెడ గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు ముగ్గు పోసి భూమి పూజ కార్యక్రమానికి కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు భూక్య గోపాల్ నాయక్ హాజరయ్యారు..ఈ సందర్భంగా ఇందిరమ్మ లబ్ధిదారు బాధవత్ మంజుల-బాలు దంపతులకు శుభాకాంక్షలు తెలియ చేశారు..ఈ సందర్భంగా ఇందిరమ్మ లబ్ధిదారు మాట్లాడుతూ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసిన ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి కి గ్రామ కాంగ్రెస్ నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు....ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు భూక్య గోపాల్ నాయక్ మాట్లాడుతూ పేదల అభి వృద్ధి కాంగ్రెస్ పార్టీ ద్వారానే సాధ్యమని పేద ప్రజల అభ్యున్నతికి కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుందని ఆయన అన్నారు..ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ భూక్య బుజ్జి సురేష్ గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు పులిశెరు రాజేందర్ నాయకులు బాధవత్ వీరు ముత్యం భద్రయ్య బాధవత్ చందర్ బాలు నాయక్ తేజవత్ భద్రు తేజవత్ శివ మైనార్టీ సెల్ మండల ప్రధాన కార్యదర్శి షేక్ కయాజ్ ఇస్లావత్ వీరు తేజవత్ శ్రీకాంత్ బాధవత్ శ్రీను బాధవత్ రమేష్ బస్సీ నర్సమ్మ సుక్కి తదితరులు పాల్గొన్నారు




# సోషల్ మీడియా వేదికగా రేవంత్ సర్కార్ను ప్రశ్నిస్తున్న బీఆర్ఎస్ నేతలను పోలీసులు అరెస్టులు

**(నారుకట్లమధు ప్రజాతీర్పు రాజన్న సిరిసిల్ల జిల్లా) జూన్ 21**

ఎందుకు అరెస్టు చేశారంటూ ప్రశ్నిస్తున్న బీఆర్ఎస్ నేతలపై పోలీసులు ఎదురు దాడికి ప్రయత్నిస్తున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం బండపల్లి గ్రామానికి చెందిన వికలాంగుడు న్యాత సురేష్‌ను వేములవాడ పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకోవడం వివాదాస్పదంగా మారింది. వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌పై నమస్తే తెలంగాణ పత్రికలో వచ్చిన కథనాన్ని సోషల్ మీడియాలో పోస్టు చేసినందుకే పోలీసులు అదుపులోకి తీసుకోవడంపై బీఆర్ఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.. ఈ ఘటనను తీవ్రంగా ఖండించిన వారు పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన వ్యక్తం చేశారు. బండపల్లి గ్రామానికి చెందిన న్యాత సురేష్‌ను అర్ధరాత్రి సమయంలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారనే సమాచారం తెలుసుకున్న బీఆర్ఎస్ పట్టణ నాయకులు, కార్యకర్తలు వేములవాడ టౌన్ పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. సురేష్‌ను ఏ కారణాలతో అదుపులోకి తీసుకున్నారో వెల్లడించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. సోషల్ మీడియాలో ఒక పోస్టు పెట్టినందుకే వికలాంగ యువకుడిని తీవ్రవాదిని పట్టుకున్నట్టుగా అర్ధరాత్రి ఇంటి నుంచి తీసుకెళ్లడం దారుణమన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజలకు రాజ్యాంగం కల్పించిన వాక్ స్వాతంత్ర్య హక్కు ఉందని, ప్రభుత్వాన్ని ప్రశ్నించే గొంతులను అణచివేయడం సరైన విధానం కాదన్నారు.ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌పై విమర్శలు చేసిన వారిని లక్ష్యంగా చేసుకుని వేధింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్య విలువలను తుంగలో తొక్కుతూ, ప్రశ్నించే స్వరాలను పోలీసు వ్యవస్థ ద్వారా అణచివేయాలని చూస్తోందని విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపినా, ప్రజా సమస్యలపై స్పందించినా కేసులు, అరెస్టులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని బీఆర్ఎస్ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే న్యాత సురేష్‌పై తీసుకున్న చర్యల వివరాలను వెల్లడించి, చట్టబద్ధంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు.. లేనిపక్షంలో ఈ ఉద్యమాన్ని ఉధృతం చేస్తామంటూ హెచ్చరించారు....




# రొమాంటిక్‌గా రాజా ది రాజా



రుత్విక్, విశాఖ దీమన్ జంటగా నటిస్తున్న యూత్‌ఫుల్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్ 'రాజా ది రాజా'. అనిల్ బోయిడపు దర్శకుడు. కె.నిహారిక దాసరి నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని కె.శ్రీలతారెడ్డి సమర్పిస్తున్నారు. జూలై 17న సినిమా విడుదల కానున్నది. ప్రతిష్టాత్మక మైత్రీ డిస్ట్రిబ్యూటర్స్ ఈ చిత్రాన్ని విడుదల చేస్తుండటం విశేషం. ఈ సందర్భంగా విడుదల చేసిన రిలీజ్ డేట్ పోస్టర్ కలర్‌ఫుల్ విజువల్స్‌తో రొమాంటిక్ మూడ్‌ని ప్రజెంట్ చేస్తున్నది. డా.నరేష్ విజయకృష్ణ, సాయికుమార్, అవసరాల శ్రీనివాస్ తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: రవికిరణ్ బోయిడపు, సంగీతం: మార్క్ కె.రాబిన్, నిర్మాణం: బృందావన్ క్రియేషన్స్.




# 'సింగ్ గీతం'కు ఫ్యామిలీ ఆఫర్.. తెలంగాణ మల్టీప్లెక్స్‌ల్లో టికెట్ ధర తగ్గింపు!

లెజెండరీ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు 61వ చిత్రంగా తెరకెక్కిన 'సింగ్ గీతం' సినిమా విమర్శకులు, ప్రేక్షకుల నుంచి మంచి పాజిటివ్ టాక్ తెచ్చుకున్న సంగతి తెలిసిందే. నాగ్ అశ్విన్ నిర్మించిన ఈ చిత్రంలో అయాన్, అహల్య ప్రధాన పాత్రల్లో నటించారు. అయితే సినిమాకు వచ్చిన పాజిటివ్ రెస్పాన్స్ నేపథ్యంలో మేకర్స్ తెలంగాణలోని మల్టీప్లెక్స్‌ల్లో టికెట్ ధరలను తగ్గిస్తున్నట్లు ప్రకటించారు. ఇప్పటివరకు రూ.200గా ఉన్న టికెట్ ధరను రూ.175కు తగ్గించారు. ఫ్యామిలీ ఆడియన్స్‌కు సినిమా మరింత అందుబాటులో ఉండేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు చిత్ర బృందం తెలిపింది. ఈ సినిమాకు పలువురు సెలబ్రిటీలు ప్రశంసలు కురిపించగా, తాజాగా రెబల్ స్టార్ ప్రభాస్ కూడా సపోర్ట్ చేస్తూ ప్రమోట్ చేశారు.

Edited Printed Published and Owned by SOYINENI MAHESH, **RNI Reg no. APTEL/2001/5268** printed at m/s Ganesh Printers Ramantapur Hyderabad, Published at m/s Bavani Publication Trust Plot No C-1/2c idl Uppal hydrabad-500039 Chieff Editor : S.Mahesh, 94946 59622, office : 8309979541, Admn office: 1-7-334 2nd floor Musherabad Hydrabad -500020